ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి శిబిరానికి

అపూర్వ స్పందన



- ప్రారంభించిన కలెక్టర్ వెంకటేశ్వర్
- ప్రముఖ డాక్టర్ల పర్యవేక్షణలో హెల్త్ మీట్
- నేటితో ముగియనున్న వైద్య శిబిరాలు

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి):ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో శనివారం తిరుపతిలో మొదలైన వైద్యజ్యోతి శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు శిబిరానికి హాజరై ఉచితంగా వైద్య సలహాలు తీసుకున్నారు. శనివారం ఉదయం తుడా సర్కిల్లోని ఇందిరామైదానంలో ఏర్పాటుచేసిన ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతి కార్యక్రమాన్ని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ప్రారంభించారు. వివిధ ఆస్పత్రులు ఏర్పాటుచేసిన స్టాళ్లను పరిశీలించారు. ఆయా ఆస్పత్రులు అందించే వైద్య సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన వైద్యజ్యోతి శిబిరంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది రాత్రి 8 గంటల వరకు సేవలందించారు. ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేశారు. అంతేకాకుండా రోగులకు అవసరమైన చికిత్స కోసం సంబంధిత ఆస్పత్రులకు వెళ్లేవారికి ప్రత్యేక రాయితీలను అందించారు.

నేడు కూడా హెల్త్ క్యాంప్

ఆదివారం కూడా మెగా హెల్త్ క్యాంప్ ఇందిరా మైదానంలో కొనసాగనుంది. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రుల స్టాళ్లలో ఉచితంగానే వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ప్రముఖ డాక్టర్లు పాల్గొంటారు. తిరుపతి నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు.

ప్రసిద్ధ ఆస్పత్రుల వైద్య సేవలు :

ఆంధ్రజ్యోతి- వైద్య జ్యోతిలో వెంకటరమణ గుండె, మెటర్నిటీ హాస్పిటల్ స్టాల్‌లో ఈసీజీతో పాటు గుండె సంబంధిత వైద్య పరీక్షలు చేసి తగు సూచనలు ఇచ్చారు. మనోహరి రామచంద్ర హాస్పిటల్, అంకుర హాస్పిటల్స్ వారు తమ స్టాళ్లలో గర్భిణులు, తల్లి కావాలనుకునే మహిళలకు ఆరోగ్య సలహాలు ఇచ్చారు. గర్భం దాల్చిన తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భస్థ శిశువుల ఆరోగ్య మెలకువలను వివరించారు. ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ వారు ప్రధానంగా ఆర్థోపెడిక్ వ్యాధులపై అవగాహన కల్పించారు. డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, యష్ హాస్పిటల్స్, శ్రీసాయి సుధా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్, మెడిగో హాస్పిటల్స్, సన్‌ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ స్టాళ్లలో వివిధ వ్యాధులకు సంబంధించి వైద్య పరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది తగు సలహాలు, సూచనలు ఇచ్చారు.కాకర్ల డెంటల్ హాస్పిటల్, కృష్ణతేజ డెంటల్ హాస్పిటల్స్ వారు దంత సంబంధ పరీక్షలు నిర్వహించి, అధునాతన దంత వైద్యంపై అవగాహన కల్పించారు.

ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఆరోగ్య సమస్యలతో సతమతం అయ్యే చాలామంది ఏ ఆస్పత్రికి వెళ్లాలో, ఏ డాక్టర్‌ను కలవాలో తెలియక ఇబ్బందిపడుతూ ఉంటారు. అటువంటి వారి కోసం ఒక్క చోటే ఇంత పెద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయం. తిరుపతిలోని ప్రసిద్ధ ఆస్పత్రులన్నీ ఇక్కడ కన్పిస్తున్నాయి. ప్రముఖ డాక్టర్లంతా వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్య సలహాలు ఇవ్వడం గొప్ప విషయం. ఇక్కడ పరీక్షలు చేయించుకున్నవారికి తమ ఆస్పత్రుల్లో ప్రత్యేక డిస్కౌంట్లు ఇస్తామంటున్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలోకి రాని కొన్ని వ్యాధులకు ఇక్కడ ఉచితంగా చికిత్స దొరుకుతోంది. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఈ మెగా హెల్త్‌మీట్ నిర్వహించిన ఆంధ్రజ్యోతి- ఏబీఎన్‌కి ప్రత్యేక అభినందనలు.

- కలెక్టర్ వెంకటేశ్వర్

ఉచితంగా మందులు

బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్మన్, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ (ఎన్‌బీకే) ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు పి.మనోహర్ రెడ్డి, కేపీ చౌదరి ప్రధాన స్పాన్సర్‌గా, సీపీఆర్ కనస్ట్రక్షన్స్ వారు కో స్పాన్సర్‌గా వ్యవహరించి రోగులకు ఉచితంగా మందులు కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, ఆంధ్రజ్యోతి తిరుపతి బ్రాంచ్ మేనేజర్ వి.సురేష్‌రెడ్డి, ఎడిషన్ ఇంచార్జి వి.సుధాకరబాబు, ఏడీవీటీ ఇంచార్జి ఈశ్వరనాయుడు, ప్రొడక్షన్ ఇంచార్జి మోహన్ రావు, సర్క్యులేషన్ ఇంచార్జి ఉమాపతి, బ్యూరో ఇన్‌ఛార్జి శివప్రసాద్, స్టాఫ్ రిపోర్టర్ వి.నరేంద్ర, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టర్ శంకర్ రెడ్డి , ఆంధ్రజ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు వెళ్తూ ఇంజనీరింగ్

విద్యార్థి మృతి

మరో విద్యార్థికి తీవ్రగాయాలు



భువన్‌మనో (ఫైల్ ఫొటో)

లారీని ఢీకొని బైక్‌పై నుంచి కిందపడ్డ భువన్‌మనో, వంశీ

వడమాలపేట/బైరెడ్డిపల్లె, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పరీక్షకు వెళ్తూ మృత్యువాత పడ్డాడో ఇంజనీరింగ్ విద్యార్థి. మరో విద్యార్థి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ ఘటన తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై వడమాలపేట టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు.. తొట్టంబేడు మండలం పెద్దకనపర్తి గ్రామానికి చెందిన వెంకటరామయ్య కుమారుడు వంశీ(20), బైరెడ్డిపల్లె మండలం గాజీపేటకు చెందిన నరసింహులు కుమారుడు కేఎస్ భువన్‌మనో(20) పుత్తూరు సమీపంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. తిరుపతి సమీపంలోని చెర్లోపల్లి అయాన్ డిజిటల్ కేంద్రంలో జరుగుతున్న ఎన్‌పీ టెల్(నేషనల్ ప్రోగ్రాం ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ఆన్‌లైన్ కోర్సు పరీక్ష రాసేందుకు కళాశాల నుంచి ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. చెన్నై నుంచి కర్నూలుకు జిప్సం లోడ్‌తో వెళుతున్న టీఎస్ 23 టీఈ 8084 నంబరు లారీని టోల్‌గేట్ సమీపంలోని చెట్టినాడ్ హోటల్ వద్ద భోజనం కోసం డ్రైవర్ రోడ్డు పక్కగా నిలిపే ప్రయత్నం చేశాడు. దీన్ని గమనించేలోపు భువన్‌మనో నడుపుతున్న ద్విచక్ర వాహనం లారీ వెనుక భాగంలో ఢీకొంది. ఈ ఘటనలో భువన్‌మనోకు హెల్మెట్ లేకపోవడంతో తల బలంగా ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు.వెనుక కూర్చున్న వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ధర్మారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వంశీని 108లో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. భువన్‌మనో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి పంపించారు.అది పూర్తయ్యాక శనివారం రాత్రి భువన్ మృతదేహం గాజీపేట చేరింది. ఆదివారం స్వగ్రామంలో భువన్ అంత్యక్రియలు జరగనున్నాయి.

ఇకపై గంట ముందే పీజీఆర్ఎస్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రత కారణంగా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సమయంలో మార్పు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి ప్రతి సోమవారమూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డివిజన్, మండల కేంద్రాల్లోనూ ఇదే సమయంలోనే నిర్వహించనున్నట్లు వివరించారు.

నెలాఖరులోగా ఈకేవైసీ తప్పనిసరి

- లేకుంటే ఏప్రిల్ నుంచి రేషన్ కట్

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోని రేషన్‌కార్డుదారులకు ఏప్రిల్ నుంచి రేషన్ సరుకులు బంద్ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో 6.35లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటన్నింటికీ ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. రేషన్ దుకాణాలతో పాటు మీ-సేవ, ఆధార్ కేంద్రాల్లో, సచివాలయాల్లో ఈకేవైసీ చేసుకోవచ్చునని డీఎస్‌ఓ శేషాచలం రాజు చెప్పారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు మినహా మిగిలిన వారు తప్పనిసరిగా చేసుకోవాలని పేర్కొన్నారు. రేషన్ దుకాణాలకు వెళ్లి ఈపోస్‌పై వేలిముద్ర వేస్తే డీలర్ లాగిన్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకోవచ్చని వివరించారు.

రేపు టీటీడీ బోర్డు సమావేశం

- సీఎం సూచనలపై చర్చ
- 2025-26 బడ్జెట్ సమర్పణ

తిరుమల,మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరుగనుంది. అన్నమయ్య భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో 2025-26 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే గతంలో తీసుకున్న నిర్ణయాలపై సమీక్షించడంతో పాటు ఇప్పటికే సిద్ధం చేసిన అజెండాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. శ్రీవారి దర్శనం కోసం వచ్చిన సీఎం చంద్రబాబు బోర్డుకు, అలాగే సభ్యులకు చేసిన పలు సూచనలపై కూడా చర్చించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం నూతన ట్రస్టును ఏర్పాటు చేయాలనే సూచనకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. అలిపిరిలో కొండలకు వెంబడి ఉన్న ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా చేసే అంశంపైనా చర్చించనున్నారు. అన్యమత ఉద్యోగుల తరలింపు, శ్రీవారి ఆస్తుల పరిరక్షణ కూడా చర్చకు రానున్నాయి.

అక్రమమే సక్రమంగా..

- పుత్తూరులో విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు
- అనుమతుల్లేనివి 14.. ఉన్నవి 5
- ముడుపులిస్తే రైట్ రైట్ అంటున్న పట్టణ ప్రణాళిక అధికారులు

పుత్తూరు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పుత్తూరు పట్టణం రోజురోజుకూ విస్తరిస్తోంది. అదే సమయంలో ఆక్రమణలూ పెరుగుతున్నాయి. చెరువులు, కాలువలు, కుంటలు అన్యాక్రాంతమవుతున్నా కాపాడాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉంటున్నారు. ముడుపులు చెల్లిస్తే అక్రమాలను సక్రమం చేసేస్తున్నారు. పట్టణ పరిధిలో లేఅవుట్ అనుమతులు లేకుండా 14 వెంచర్లను రియల్టర్లు విక్రయించేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు 5 లేఅవుట్లకు మాత్రమే తుడా అనుమతులు ఉన్నాయంటే అర్థం చేసుకోవచ్చు.



ఈశ్వరాపురంలో ఏర్పాటు చేసిన అనధికార లే అవుట్

అనధికార లేఅవుట్లు ఇవే..

పుత్తూరు పరిధిలోని నంది మంగళం రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 102/7 పార్ట్, 108/8ఎ పార్ట్‌లో 1.08 ఎకరాలు, 4 పార్ట్, 5 పార్ట్‌లో 1.26 ఎకరాలు, 5 పార్ట్‌లో 1.4 ఎకరాలు, పుత్తూరు రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 24/3బి1 పార్ట్, 29/10 పార్ట్, 29/9బి2 పార్ట్‌లో 2.16 ఎకరాలు, 263/6బిలో 1.86 ఎకరాలు, ఈశ్వరాపురంలో సర్వే నెంబర్ 162/1లో 1 ఎకరా. 84/12ఎ, 13, 14ఎ, 16ఎలో 2.06 ఎకరాలు, 122/4, 122/5లో 1.8 ఎకరాలు, 87/1ఎ, 87/1ఎ1లో 1.45 ఎకరాలు, చెర్లోపల్లి రెవెన్యూ గ్రామంలో 59/11 పార్ట్, 12 పార్ట్, 17 పార్ట్, 18 పార్ట్‌లో 0.85 సెంట్ల భూమిలో అనుమతుల్లేని లే అవుట్లు ఉన్నాయి.

ఇప్పటికే నోటీసులు జారీ చేశాం

నందిమంగళం, పుత్తూరు, ఈశ్వరాపురం, చెర్లోపల్లి, గోవింద పాలెం, నేసనూరు ప్రాంతాల్లో అనుమతులు లేని 14 లే అవుట్లను గుర్తించాం. వాటిని వేసి, విక్రయించిన రియల్టర్లకు నోటీసులు జారీ చేయడమేగాక లే అవుట్ వద్ద అంటించాం.

- నీరజాక్షి, ప్రణాళిక విభాగం అధికారిణి

మౌలిక వసతులు కట్..

అనుమతుల్లేకుండా ఏర్పాటైన లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయవద్దని ప్రజలకు మున్సిపల్ కౌన్సిల్‌సూచించింది. ఈ మేరకు గత ఏడాది అక్టోబర్‌లో జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేసింది. ఈ లే అవుట్లలో మున్సిపాలిటీ నుంచి ఎటువంటి మౌలిక వసతులూ కల్పించేది లేదని స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్లు జరగకుండా నిషేధిత జాబితాలో పెట్టనున్నట్లు తెలిపింది. భవన నిర్మాణ అనుమతులు ఇవ్వబోమని, రోడ్లు, కరెంట్, నీరు, డ్రైనేజీ సదుపాయాలు కల్పించేది లేదని తీర్మానించింది. ప్రభుత్వం కూడా ఇదే తరహా హెచ్చరికలు జారీ చేసింది.కౌన్సిల్ తీర్మానాన్ని అమలు చేయడంలో పట్టణ ప్రణాళిక విభాగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.లే అవుట్లలో నిర్మాణాలను ప్రోత్సహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే, ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టే అక్రమ లేఅవుట్లపై కమిషనర్ మంజునాథ్ గౌడ్ దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:55 (సోమవారం ఉదయం)

రాష్ట్రస్థాయి యూత్ పార్లమెంట్‌కు

10మంది ఉమ్మడి జిల్లా విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంటుకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నాగేంద్ర, నెహ్రూయువకేంద్ర యూత్ అధికారి ప్రదీప్‌కుమార్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుశీలా భారతి శనివారం తెలిపారు. శుక్రవారం పీవీకేఎన్‌లో భారత ప్రభుత్వ యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంఘటన్ సంయుక్త ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యువజన పార్లమెంట్ కార్యక్రమం నిర్వహించగా 115 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 75 మంది విద్యార్థులు ఒకేదేశం-ఒకే ఎన్నిక అనే అంశంపై ప్రసంగించిన విషయం తెలిసిందే. ఇందులో న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన హరినాయుడు, మనోహర్, మునిచంద్ర నాయుడు, ఉమాదేవి, ప్రదీప్‌కుమార్‌లు 10 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల్లో.. తిరుపతి ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాలకు చెందిన రాజ్వీ భావ్సార్, అక్షిత, పి.మోహిత, ఎ.చూడామణి కృష్ణ, అజిత్ కృష్ణలతో పాటు సయ్యద్ అబ్దుల్ అజీజ్ (మోహన్‌బాబు యూనివర్సిటీ, తిరుపతి), ప్రగతి జైస్వాల్ (మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి), సాన్య(అపోలో యూనివర్సిటీ, చిత్తూరు)కె.ఎన్.వైష్ణవి (విజయం డిగ్రీ కళాశాల, చిత్తూరు), పి.గోపీచంద్ (ఎస్వీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, తిరుపతి) ఉన్నారు. వీరంతా ఈనెల 28న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్‌లో అక్కడ ఎంపిక చేసిన అంశంపై రాష్ట్ర స్పీకర్ అయ్యన్నపాత్రుడు ముందు తమ వాణి వినిపించనున్నారు.

తిరుమలలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్?

గాజుసీసాల స్థానంలో అనుమతించేందుకు టీటీడీ యోచన



గాజు వాటర్ బాటిళ్లు

తిరుమల, మార్చి22 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో గాజు నీళ్ల సీసాల స్థానంలో మళ్లీ ప్లాస్టిక్ బాటిల్స్‌ను అనుమతించే ఆలోచనలో టీటీడీ ఉన్నట్టు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణ దృష్టితో 2020లో తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించారు. ఇందులో భాగంగానే వాటర్ బాటిళ్ల స్థానంలో గాజు సీసాలు ప్రవేశపెట్టారు. ఒక లీటర్ బాటిల్ రూ.50. ఏ దుకాణంలో బాటిల్ వెనక్కి ఇచ్చినా రూ.30 ఇస్తారు. అయితే చాలామంది భక్తులు వెనక్కివ్వకుండా పడేస్తున్నట్టు గుర్తించారు. ఇవి పగిలి ప్రమాదకరంగా మారుతున్నాయి. దీనికి తోడు గొడవపడ్డ సమయంలో భక్తులు గాజు సీసాలను ఆయుధాలుగా వాడేస్తున్నారు. గత జూలైలో వైజాగ్‌కు చెందిన ఒక కుటుంబంతో మాటామాటా పెరిగి దుకాణంలో పనిచేసే వ్యక్తి గాజు సీసాతో దాడి చేయడంతో భక్తుడు, అడ్డు వెళ్లిన హోంగార్డు గాయపడ్డారు. తాజాగా గురువారం మరో సంఘటనలో కర్ణాటక, తమిళనాడు భక్తుల మధ్య జరిగిన ఘర్షణలో గాజు బాటిల్‌తో దాడిలో ఇద్దరు రక్తగాయాల పాలయ్యారు. వీటి స్థానంలో బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ బాటిళ్లు, టెట్రా వాటర్ ప్యాకెట్ల వినియోగంపై టీటీడీ ఉన్నతాధికారులకు కొన్ని సంస్థలు డెమో ఇచ్చాయి.వీటి వినియోగంపై పరిశీలనకు ఓ ప్రత్యేక కమిటీని టీటీడీ ఈవో శ్యామలరావు నియమించారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



● మెడిగోప్లస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆర్థోపెడిక్ నిపుణుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి రోగులకు వైద్య సేవలు అందించారు. కీళ్ల, నరాల సమస్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. రోగులకు అవసరమైన మందులను అందించారు.



● యష్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సాయికిరణ్ పరీక్షలు నిర్వహించారు. కంటి సమస్యలు రాకుండా పాటించాల్సిన జాగ్రత్తలు, వచ్చాక తీసుకోవాల్సిన వైద్య పద్ధతుల గురించి వివరించారు.



● సాయిసుధా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్లు, ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ సుకుమార్, కంటి వైద్య నిపుణురాలు సుధారాణి వైద్య సేవలు అందించారు. చికిత్స అవసరమైన వారు తమ ఆస్పత్రికి వస్తే ఉచిత సేవలు అందిస్తామన్నారు.



● డీబీఆర్ అండ్ ఎస్కే క్యాన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో డాక్టర్ లోకేష్‌రెడ్డి రోగులకు వైద్య సేవలను అందించారు. క్యాన్సర్ కారకాలు, దాని చికిత్సా మార్గాల గురించి అవగాహన కల్పించారు. న్యూరాలజీ వైద్య పద్ధతుల గురించి వివరించారు.





రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - శిబిరానికి హాజరైనవారు

ఆంధ్రజ్యోతి- వైద్యజ్యోతిలో
ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు

● ప్రముఖ ఆస్పత్రుల ఆధ్వర్యంలో పరీక్షలు

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసే ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ తిరుపతి నగరంలో రెండు రోజుల మెగా వైద్య శిబిరం ప్రారంభించింది. వైద్యజ్యోతి పేరుతో ఇందిరా మైదానంలో శనివారం మొదలైన ఈ శిబిరంలో తిరుపతిలోని ప్రసిద్ధ ఆసుపత్రులు వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నాయి. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నాయి. ఆదివారం కూడా ఈ సేవలన్నీ ప్రజలకు యధాతథంగా అందించనున్నాయి.



●డీఎస్ఆర్ డయాబెటిక్ సెంటర్ డీఎస్ఆర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో డయాబెటిక్ వైద్య నిపుణుడు డాక్టర్ డీఎస్‌రెడ్డి బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. డయాబెటిక్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

●సన్ ప్రైమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్రిటికల్ కేర్ వైద్య నిపుణుడు డాక్టర్ గణేష్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ పవన్, ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ శ్రీతేజలు వైద్య సేవలను అందించారు. అత్యవసర పరిస్థితుల్లో అనుసరించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు.



● కాకర్ల దంత వైద్యశాల ఆధ్వర్యంలో డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ నవ్యలు దంత వైద్య సేవలను అందించారు. దంత సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించి మందులను అందించారు.

● వెంకట్రమణ గుండె, మెటర్నిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎండీ, కార్డియాలజిస్టు డాక్టర్ వెంకట్రమణ ఉచితంగా ఈసీజీ, బీపీ, షుగర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులను అందించారు.







● అంకురా ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్ నాగలక్ష్మి పలువురు మహిళలకు గైనకాలజీ వైద్య సేవలను అందించారు. గర్భకోశ వ్యాధులపై సలహాలు అందజేశారు. అవసరమైన మందులను అందించారు.



● కృష్ణతేజ దంత వైద్యశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో దంత వైద్యురాలు డాక్టర్ శిరీష ప్రజలకు దంత వైద్య సేవలను అందించారు. వ్యాధి తీవ్రత ఉన్న వారు తమ ఆస్పత్రిలో సంప్రదిస్తే ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు.



●ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ వైద్యులు డాక్టర్ సాయిరాం తేజ, డాక్టర్ కృష్ణలు వైద్య సేవలను అందించారు. ఆరోగ్య, ఆహార విషయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అవసరమైన మందులను అందజేశారు

● మనోహరి రామచంద్ర సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో డాక్టర్లు రామచంద్ర, హర్ష, అచ్యుతలు వైద్య సేవలను అందించారు. కిడ్నీ సమస్యల పరిష్కారానికి సూచనలిచ్చారు. రోగులకు మందులను అందించారు.



మార్కెట్ వేలం అదుర్స్

● రూ4.76కోట్లు పలికిన ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్
● గత మూడేళ్ల సరాసరి రూ3.25 కోట్లే

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌కు తిరుపతి నగర పాలకసంస్థ నిర్వహించిన బహిరంగ వేలంలో రూ4.76 కోట్ల ధర పలికింది. 2025-26 సంవత్సరానికి శనివారం కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన వేలంలో మోహన్ బాబు అనే వ్యక్తి మార్కెట్‌ను సొంతం చేసుకున్నారు. రామచంద్ర గుంట కట్ట మార్కెట్‌ను రూ2.34లక్షలు, జంతు వధశాలను రూ4లక్షలకు యస్.మునిరాజ బాబు దక్కించుకున్నారు. గాంధీ రోడ్డు, తిలక్ రోడ్డు, మాస్క్‌రోడ్డు, తిలక్ రోడ్డు మార్జిన్లతో పాటు హరే రామ హరే కృష్ణ గుడి రోడ్డు ఇరు వైపులా, కపిల్ తీర్థం జంక్షన్ వద్ద పార్కింగ్ స్థలాలను బి.విష్ణువర్ధన్ రూ33లక్షలకు, శ్రీనివాసం ఏరియా ఎదురుగా భారతి బస్టాండ్ పార్కింగ్ స్థలాన్ని యం.కె.సురేష్ కుమార్ రూ10.40లక్షలకు, జీఎన్, జి.యస్.పార్కింగ్ స్థలాన్ని ఎం.కృష్ణమూర్తి రూ3.35లక్షలకు దక్కించుకున్నారు. కాగా వినాయక సాగర్ పార్కుకు ముగ్గురు డిపాజిట్ చెల్లించగా, ఒకే సీల్డ్ టెండర్ వచ్చింది. ఏడాదికి రూ18 లక్షల కోడ్ చేయడంతో నగరపాలక సంస్థ నిర్ణయించిన అద్దె కంటే తక్కువ కావడంతో వాయిదా వేశారు. వినాయక సాగర్ పార్కులో గేమ్ జోన్‌ను, బొంతాలమ్మ గుడి వద్ద నిర్మించిన షాపింగ్ కాంప్లెక్సు రెండవ అంతస్తు హాలుకు, స్పోర్ట్స్ కాంప్లెక్స్(ఇందిరా మైదానము)కు వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదు. ఈ వేలంలో డిప్యూటీ కమిషనర్ అమరాయ్య, రెవెన్యూ ఆఫీసర్స్ సేతు మాధవ్, రవి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఏడాదికి కోటి నష్టం..

గత మూడేళ్లలో సరాసరి సుమారు రూ3.25కోట్లు ఉండగా ఈసారి జీఎస్టీతో కలిపి రూ.5కోట్లు వరకు మార్కెట్ ధర పలకడం చర్చగా మారింది. వైసీపీ హయాంలో బహిరంగ వేలం పారదర్శకంగా నిర్వహించకపోవడంతోనే ఏడాదికి కోటి రూపాయలకు పైగా నష్టం వచ్చినట్టు వేలం ద్వారా తెలుస్తోంది.

శబ్ద బోధ మీమాంసపై వర్క్‌షాప్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): శబ్ద బోధ మీమాంసపై జాతీయ సంస్కృత వర్సిటీలో వారం రోజుల వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాజస్థాన్ సంస్కృత వర్సిటీ మాజీ వీసీ రామకృష్ణమాచార్యులు, మణిద్రావిడశాస్త్రి, విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, రామానుజ ప్రాజెక్టు డైరెక్టర్ కేఈ దేవనాథన్, డీన్ సత్యనారాయణాచార్య, బలిచక్రవర్తి, నాగరాజభట్, శివరాంభట్, భరత్‌భూషణ్‌రత్, ఏపీఆర్వో డాక్టర్ కనపాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వైజ్ఞానిక, మానవీయ శాస్త్రాలను అనుసంధానించవలసిన అవసరం ఉందని మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని పేర్కొన్నారు. రెండు రోజులుగా పద్మావతి వర్సిటీ ఇంగ్లీషు విభాగం నిర్వహించిన జాతీయ సదస్సు ముగింపు సభ శనివారం నిర్వహించారు.తొలుత సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. ఉన్నత విద్యా మండలి వైస్ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరిదేవి, సైన్స్ డీన్ సుధ, సదస్సు కన్వీనర్ వైఎస్ శారద, కో-కన్వీనర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జగతి నెట్‌వర్క్‌తో పద్మావతి కాలేజీ ఎంఓయూ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జగతి నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీతో పద్మావతి డిగ్రీ కళాశాల అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలపై ఇరు సంస్థల అధికారులు శనివారం సంతకాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో పరస్పరం సహకరించుకోనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జగతి నెట్‌వర్క్ ఎండీ వాసుదేవనాయుడు, పద్మావతి కాలేజీ ప్రిన్సిపాల్ నారాయణమ్మ, నోడల్ ఆఫీసర్ భద్రమణి, సైకాలజీ హెడ్ విద్యుల్లత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంకేతిక ప్రదర్శన

తిరుపతిరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన జాతీయస్థాయి పొటెన్షా సాంకేతిక ప్రదర్శన ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు సెన్సార్ ద్వారా ప్రమాద నివారణ, ఐవోటీ ఆధారిత స్మార్ట్ హోమ్ ఆటోమేషన్, ఫుట్‌స్టెప్ ఎలక్ట్రికల్ జనరేషన్, వైర్‌లెస్ చార్జింగ్ వాహనాలు వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు.అకడమిక్ డైరెక్టర్ ఆనందరెడ్డి, చైర్మన్ వై.కొండారెడ్డి, వై.నితిన్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రాజశేఖర్, ట్రిపుల్‌ఈ విభాగ హెడ్ బాలసుబ్రమణ్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాలల జేఏసీ నిరసన

తిరుపతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాలల సింహగర్జన సభ జరగనివ్వకుండా అడ్డుకోవడం దారుణమని మాలల జేఏసీ ప్రధాన కార్యదర్శి పూతలపట్టు ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పాకాల, చౌడేపల్లి, చంద్రగిరిలలో సింహగర్జన సభ బ్యానర్లను ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు.తిరుపతిలోని నెహ్రూమున్సిపల్ మైదానంలో ఆదివారం జరగాల్సిన మాలల సింహగర్జన సభకు అనుమతి ఇచ్చి తరువాత రద్దు చేయడం దారుణమన్నారు. మాలల జేఏసీ నేతలు ధనశేఖర్, మనోహర్, మహేష్, రమేష్ హరి, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్పార్క్ పోటీలు

తిరుపతిరూరల్, మార్చి22(ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని ఎస్వీకాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో స్పార్క్-2కె25 పేరిట రెండ్రోజులపాటు నిర్వహించిన అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీలు శనివారంతో ముగిశాయి. ప్రోషో, మ్యూజిక్‌బ్యాండ్, ఫ్యాషన్‌వాక్, నృత్యప్రదర్శలు వంటి పోటీలు ఆకట్టుకున్నాయి. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. చెన్నైకి చెందిన జోహో సంస్థ సీనియర్ మేనేజర్ జీవిత, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.సుధాకర్‌రెడ్డి, చైర్మన్ గంగిరెడ్డి, వైస్‌చైర్మన్ ప్రకాష్, సెక్రటరీ ప్రదీప్, స్టూడెంట్స్ అఫైర్స్ కమిటీ డీన్ డాక్టర్ వి.మధురిమ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తారకేశ్వర్, వివిధ విభాగాల హెడ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



జీవితకు జ్ఞాపికని అందిస్తున్న ఎస్వీసీఈ ప్రిన్సిపాల్

తాతయ్యగుంట గంగమ్మ ఆలయాభివృద్ధికి టీటీడీ సహకారం

వైభవంగా గంగజాతర నిర్వహణ

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ ఆలయాభివృద్ధికి టీటీడీ పూర్తి సహకారం అందిస్తుందని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతిలోని గంగమ్మ ఆలయాన్ని శనివారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలిసి ఆయన సందర్శించారు. అమ్మవారి దర్శనానంతరం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా రెండో దశ పనులకు రూ.3.90 కోట్లు ప్రతిపాదనలు వచ్చాయని, రాబోయే బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. మే 6 నుంచి 13వ తేదీ వరకు జరిగే తిరుపతి గంగ జాతరను వైభవంగా నిర్వహించడానికి టీటీడీ సహకరిస్తుందని తెలిపారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్ రెడ్డి, సుగుణమ్మ, శాప్ చైర్మన్ రవినాయుడు, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాంతారాం, సామంచి శ్రీనివాస్, రాజారెడ్డి, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.



గంగమ్మను దర్శించుకుంటున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

నేడూ విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

తిరుపతి(ఆటోనగర్) మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో ఆదివారం విద్యుత్ బిల్లులు వసూలు కేంద్రాలు పనిచేస్తాయని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖర్ రావు తెలిపారు. వినియోగదారులు బిల్లులు చెల్లించుకోవచ్చని తెలియజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఆర్టీసీ బస్టాండు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయసు ఉంటుంది. ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు.




కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ ఎదుట విచారణకు హాజరై బయటకు వస్తున్న టీటీడీ మాజీ సీవీఎస్‌వో శ్రీధర్, సస్పెండ్ అయిన డీఎస్పీ రమణకుమార్, టీటీడీ గోశాల మాజీ డైరెక్టర్ హరినాథరెడ్డి (వార్త 3వ పేజీలో)

నేరాలు కొనసాగిస్తే పీడీ యాక్టు : సీఐ

కొర్లగుంటలో పోలీసుల మాబ్ సెర్చింగ్



తిరుపతి (నేర విభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఈస్ట్ పోలీసులు శనివారం సాయంత్రం కొర్లగుంట, సంజయ్‌గాంధీ కాలనీ, చంద్రశేకర రెడ్డి కాలనీ, మసీదు వీధి ప్రాంతాల్లో మాబ్ సెర్చింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు, ఆకతాయిలు, జైలు నుంచి విడుదలైన వారిపై ఎస్పీ హర్షవర్ధన రాజు ఆదేశాల మేరకు సీఐ రామకృష్ణ, ఎస్ఐలు బాలకృష్ణ, మహేష్, గిరిబాబు, ఎస్టీఎఫ్ సిబ్బంది కలసి దాదాపు రెండు గంటల పాటు హల్‌చల్ చేశారు. కొంతమంది అనుమానితులను విచారించారు. వారి ఆధార్ కార్డులు, అడ్రస్‌లు సేకరించారు. చంద్రశేఖర రెడ్డి కాలనీలో కొన్ని ఇళ్లను తనిఖీ చేశారు. ఆకతాయిలు పద్ధతి మార్చుకోకపోతే జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. ఒకటికి రెండుసార్లు నేరాలకు పాల్పడితే అలాంటి వారిపై పీడీ యాక్టు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.



శాప్ చైర్మన్‌కు ఘనసన్మానం

తిరుపతి(క్రీడలు), మార్చి 22(ఆంధ్రజ్యోతి): శాప్ చైర్మన్ రవినాయుడుని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 18నుంచి మూడు రోజుల పాటు విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శాసనసభ, శాసనమండలి సభ్యుల క్రీడా, సాంస్కృతి కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఉప మేయర్ ఆర్సీ మునికృష్ణ, కూటమి నాయకులు రాజారెడ్డి, మహేష్‌యాదవ్, కరాటే చంద్ర, సానె శీను, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో తెలుగును తప్పనిసరి సబ్జెక్ట్‌గా కొనసాగించాలి

తిరుపతి(విద్య), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా కొనసాగించాలని తెలుగు జూనియర్ అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆ మేరకు శనివారం ఎస్వీ జూనియర్ కళాశాలలో ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో భాగంగా తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్పు చేయడం తగదన్నారు.

'మీ తప్పిదాలను వైసీపీపై రుద్దుతున్నారు'

తిరుపతి(జీవకోన), మార్చి 22(ఆంధ్రజ్యోతి): టీడీపీ పాలనలో చేసిన తప్పిదాలను వైసీపీ ప్రభుత్వంపై రద్దుతున్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి ఆరోపించారు. శనివారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముంతాజ్ హోటల్‌కు అనుమతులు రద్దు చేసిన అంశాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే వైసీపీ ఇచ్చిన అనుమతులను రద్దు చేశానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రుయాలో ఏడీఎంఈ తనిఖీలు

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యసేవలు అందించాలని అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేశ్వర్లు రుయా అధికారులను ఆదేశించారు. రుయాస్పత్రిని ఆయన శనివారం తనిఖీ చేశారు. అసలే సిబ్బంది కొరత ఉన్న సమయంలో ఎఫ్ఎన్‌వోలను నర్సింగ్ సూపరింటెండెంట్ కార్యాలయం ముందు ఎందుకు అటెండరులా వాడుకుంటున్నారని మండిపడ్డారు. అలాగే వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు రేడియాలజీ విభాగం ముందు కూర్చునేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడుగా జనార్దన్‌నాయుడు

రామచంద్రాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ అధ్యక్షుడుగా జనార్దన్‌నాయుడు ఎన్నికయ్యారు. శనివారం మండల కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా చండీశ్వరరెడ్డి గిరిజారాణి, హరిప్రసాద్, శివశంకర్‌రెడ్డి, కుమార్, భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా గోపీనాథ్, ప్రసాద్, కార్యదర్శులుగా శివ, నాగరాజు, రాజశేఖర్, రమాదేవి, మౌనిక, కృష్ణమూర్తి, కోశాధికారి రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.

రుయాలో వైద్య పరికరాల కొనుగోలుకు ఆర్ఈసీ చేయూత

కలెక్టర్ చొరవతో రూ.5.25 కోట్ల వితరణకు అంగీకారం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రత్యేక చొరవతో గుర్గావ్‌లో ఉన్న ఆర్ఈసీ ఫౌండేషన్ నిర్వాహకులు రుయా ఆస్పత్రిలో రూ.5.25కోట్లు విలువైనవైద్య పరికరాలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వితరణ చేయడానికి సమ్మతించారు. కలెక్టరేట్‌లో శనివారం విజయ వాడ ప్రాంతీయ విభాగంలోని అధికారులు, ఆర్ఈసీ చీఫ్ ప్రోగ్రామ్ మేనేజరు సంజయ్ కుమార్‌రాయ్, రీజనల్ ఆఫీసర్ శ్రావణ్ కుమార్‌సింగ్ కలెక్టర్ వెంకటేశ్వర్ సమక్షంలో రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభుతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో ఈ విలువైన వైద్యపరికరాలను సమకూర్చనున్నారు.



ఒప్పంద పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తున్న దృశ్యం

స్వీపింగ్ యంత్రాలతో మెరుగైన పారిశుధ్యం

తిరుపతి(జీవకోన), మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్వీపింగ్ యంత్రాలతో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుందని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అన్నారు. శనివారం నగర పరిధిలోని ఒకటవ డివిజన్ తిరుమలరెడ్డినగర్, గోదాదేవి మార్గం తదితర ప్రాంతాల్లో హెల్త్, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి నూతనంగా కొనుగోలు చేసిన స్వీపింగ్ యంత్రాల పనితీరును పరిశీలించారు. పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేపట్టేందుకు రెండు స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు చేశామని, గ్యాస్‌తో నడిచే మూడు ఆటోలను దాతలు విరాళంగా ఇచ్చారని తెలిపారు. అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్ సుందర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డీసీపీ మహాపాత్ర, రెవెన్యూ అధికారి సేతు మాధవ్, డీఈ రమణ, మధు, ఏసీపీ మూర్తి, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి పాల్గొన్నారు.

25న కల్యాణ వెంకన్న పుష్పయాగం

చంద్రగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 25న శాస్త్రోక్తంగా పుష్పయాగం జరగనుంది. ఈ సందర్భంగా 24వ తేదీ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు అంకురార్పణ నిర్వహిస్తారు. గత నెలలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో అర్చక పరిచాకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల లోపాలు జరిగి ఉంటే ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహిస్తారు.

శాఖలవారీగా నివేదికలు ఇవ్వండి : కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కలెక్టర్లకు నిర్వహించే సమీక్ష కోసం జిల్లా అభివృద్ధి పనులపై శాఖల వారీగా నివేదికలు ఇవ్వాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో అమరావతిలో ముఖ్యమంత్రి కలెక్టర్లతో సమీక్ష జరనున్న నేపథ్యంలో శనివారంలో జిల్లా యంత్రాంగంతో కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరిగిన ప్రగతి, కావాల్సిన అభివృద్ధి పనులపై శాఖలవారీగా క్లుప్తంగా నివేదిక అందజేయాలని ఆదేశించారు. 2025-26 సంవత్సరానికి వివిధశాఖల వారు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, సీపీవో ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలకు పూర్వ విద్యార్థుల వితరణ

- వాటర్ ప్యూరిఫైయర్ అందజేత



తిరుపతి (విద్య), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 2011-14 బ్యాచ్ ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విద్యార్థులు కళాశాలకు వాటర్ ప్యూరిఫైయర్‌ను వితరణగా అందజేశారు. రూ. 65వేల విలువజేసే వాటర్ ప్యూరిఫైయర్‌ను కళాశాల ప్రిన్సిపల్ వై. ద్వారకానాథరెడ్డికి శనివారం అందజేశారు. దాతలు, పూర్వవిద్యార్థులు శివశంకర్, యుగంధర్, సాయి శ్రీనివాస్, కీర్తి, గీత, చంద్రశేఖర్, కళాశాల జనరల్ సెక్షన్ హెడ్ డాక్టర్ ఎస్వీ గౌరీశంకర్, ఎలక్ట్రానిక్స్ హెడ్ అచ్యుతరావు, ఫార్మసీ హెడ్ కృష్ణమూర్తినాయుడు పాల్గొన్నారు.

అలిపిరి నడక మార్గంలో అటవీ అధికారుల తనిఖీలు

మంగళం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అలిపిరి కాలినడక మార్గంలో శనివారం పండ్ల వ్యాపారం చేసే దుకాణాలను జిల్లా అటవీశాఖ అధికారి వివేక్, ఎఫ్ఆర్వో సుదర్శన్‌రెడ్డి సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. భక్తులు పండ్లను తిని పక్కన పడవేయడంతో వాటిని తినేందుకు జింకలు, అడవిపందులు, ఇతర జంతువులు వస్తున్నాయని వాటిని వేటాడేందుకు చిరుతపులులు నడక మార్గంవైపు వస్తున్నాయని అటవీశాఖ అధికారి వివేక్ చెప్పారు. ఈ ప్రాంతంలో పండ్లు విక్రయిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

24 నుంచి నిరవధిక నిరాహార దీక్షలు

తిరుపతి(జీవకోన), మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 24వ తేదీ నుంచి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు శివప్రసాద్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.





నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని మాధవనగర్, రాజీవ్ నగర్ సెక్షన్లలో మునిరెడ్డినగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ చంద్రశేఖర్ రావు తెలిపారు. మాధవనగర్ పరిధిలో జీవకోన, ఎస్ఎన్ పురం, ఎర్ర మిట్ట, లీలామహల్ సెంటర్, శ్రీనగర్ కాలనీ, రాజీవ్ నగర్ సెక్షన్‌లో శ్రీకృష్ణనగర్, సీతమ్మ నగర్, మునిరెడ్డినగర్, పద్మావతి నగర్, సీబీ నగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు.

క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హర్షవర్ధన రాజు హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై ఎక్కడైనా బెట్టింగ్‌లు జరుగుతున్నట్లు తెలిస్తే 100, 112కు లేకుంటే 8099999977 కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించండి



టాలెంట్ ఫెస్ట్‌ను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు సృజనాత్మకంగా ఆలోచించాలని ఎస్వీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు సూచించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన స్టూడెంట్ టాలెంట్ ఫెస్ట్‌లో శనివారం ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాలపైనా దృష్టి సారించాలని కోరారు. అనంతరం విభాగాల వారిగా టాలెంట్ ఫెస్ట్‌ను ప్రారంభించారు. ఈ నెల 28వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

మేస్త్రీపై దాడి కేసులో నిందితుడి అరెస్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): డీఆర్ మహల్ రోడ్డులోని మేస్త్రీ తులసీరాంపై రెండు రోజుల క్రితం కత్తితో దాడి చేసిన ఘటనలో ఎస్టీవీ నగర్‌కు చెందిన నిందితుడు జోరాపల్లి గౌరీశంకర్‌ను ఈస్ట్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. అతడి నుంచి కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ కథనం మేరకు.. మేస్త్రీ తులసీరాం కుటుంబానికి, జోరాపల్లి గౌరీ శంకర్ కుటుంబం మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ క్రమంలో గౌరీ శంకర్ ఎలాగైనా తులసీరాంను అంతంచేయాలని భావించాడు. రెండు రోజుల క్రితం తులసీరాంపై పథకం ప్రకారం తన అనుచరులు ఉమాప్రసాద్, వెంకీతో కలిసి దాడిచేశాడు. వారి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కాగా గాయపడిన తులసీరాం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

తిరుపతి(విద్య), మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక విష్ణునివాసం వద్ద ఉన్న టీపీపీఎం హైస్కూల్ విద్యార్థులకు జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో సీపీఆర్ (కార్డియో పల్మనరి రెస్పిరేషన్)పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్యబృందం ఓ మానవ నమూనా బొమ్మను ఏర్పాటుచేసి సీపీఆర్ అత్యవసర చికిత్స అందించి ప్రాణాలు కాపాడే విధానాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనర్సింగ్ కాలేజీ చైర్మన్ వై.ప్రవీణ్, ఎస్.రత్నశేఖర్, జూనియర్ చాంబర్ ప్రతినిధులు బి.మధుసూదన్‌రెడ్డి, గుణశేఖర్, హెచ్ఎం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.






దర్శకుడు క్రిష్ - అమరనాథ్ నంబూత్రి

తిరుమలలో దర్శకుడు క్రిష్

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు క్రిష్ శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే అమరనాథ్ కేదార్‌నాథ్ వంశపారంపర్య అర్చకులు అమరనాథ్ నంబూత్రి కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

అహోబిలం పీఠాధిపతికి టీటీడీ పెద్ద మర్యాద

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అహోబిలం పీఠాధిపతి శ్రీరంగనాథ యతీంద్ర జీయర్‌స్వామి శనివారం టీటీడీ పెద్ద మర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. అఖిలాండం వద్ద పీఠాధిపతికి టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, అర్చక బృందం శఠగోపంతో ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

టెంపుల్ కారిడార్‌గా అలిపిరి మంచి నిర్ణయం: భానుప్రకాష్



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): అలిపిరి ప్రాంతాన్ని టెంపుల్ కారిడార్‌గా నిర్ణయించి భవిష్యత్తులో ఎలాంటి ధార్మిక వ్యతిరేక కార్యక్రమలూ జరగకుండా చర్యలు తీసుకోవడం శుభపరిణామమని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. తిరుమల ఆలయం ముందు శనివారం ఉదయం మీడియాతో మాట్లాడుతూ అలిపిరిలో ముంతాజ్ హోటల్‌కు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను సీఎం చంద్రబాబు రద్దు చేయడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. ఇక, శ్రీవారి ఆలయంలోని పరకామణిలో జరిగిన కోట్లాది రూపాయల దొంగతనంపై సీఐడీ విచారణకు డిమాండ్ చేస్తున్నానన్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలైన్ వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.98 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,170
తలనీలాలు సమర్పించినవారు: 26,821



'తుడా' టవర్స్‌కు పెరుగుతున్న క్రేజ్

తిరుపతి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో ఇక ఆకాశ హర్మ్యాలు రాబోతున్నాయి. మహానగరాల్లో మాత్రమే కనిపించే ఆధునిక హంగులు, సకల సౌకర్యాల సౌధాలు క్యూ కడుతున్నాయి. చింతలచేనులో ఓ ప్రైవేట్ రియల్ ఎస్టేట్ సంస్థ 13 అంతస్థులతో రెసిడెన్షియల్ టవర్స్ నిర్మించింది. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అన్నమయ్య సర్కిల్లో 14 అంతస్తుల్లో తుడా టవర్స్ పేరిట వేగంగా నిర్మాణం సాగుతోంది. దీనికి జనం నుంచి క్రేజ్ కనబడుతోంది.

తొలుత 20 అంతస్థులతో ఐకానిక్ టవర్స్ నిర్మించాలని 'తుడా' ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకుంది. డీపీఆర్ సిద్ధం చేసింది. చివరి నిమిషంలో ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అభ్యంతరం చెప్పింది. డీజీసీఏ నిబంధనల ప్రకారం విమానాశ్రయం 5 కి.మీ వ్యాసార్థంలో ఏ భవనం కూడా 45 మీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. అంటే భవనం 14 అంతస్తులపైన నిర్మాణం చేయకూడదు. తుడా టవర్స్ దూరం 10 కి.మీ పైనే ఉన్నప్పటికీ ఎయిర్ ట్రాఫిక్ ఆ ప్రాంతం నుంచే ఎక్కువగా ఉండడంతో ఎన్వోసీ ఇవ్వనట్టు తెలుస్తోంది. దీంతో 14 అంతస్థులకు పరిమితం చేసుకుని.. మళ్లీ రీడిజైన్ చేసి నిర్మాణం మొదలుపెట్టింది. వైసీపీ హయాంలో తుడా టవర్స్ పునాదుల్లో ఉన్నప్పుడే వేలం పిలిచారు. రెండు, మూడు కమర్షియల్ గదులు తప్ప తక్కినవాటికి బోణీ కాలేదు. ప్రభుత్వం మారితే నిర్మాణం ఆగిపోతుందేమోనన్న భయం కొనుగోలుదారుల్లో కనిపించింది.



ఇప్పుడేమో ప్రభుత్వం మారాక పనులు వేగవంతమయ్యాయి. ఆరంతస్తుల నిర్మాణం పూర్తిచేసుకుని వేలానికి సిద్ధమైంది. ఈనెల 8నుంచి వేలం ప్రక్రియ మొదలైనప్పటికీ శని, ఆదివారాలు సెలవులు రావడంతో మూడు రోజుల్లోనే 23 ప్లాట్లు అమ్ముడుపోయినట్టు అధికారులు చెబుతున్నారు. 'తుడా టవర్స్‌కు విశేష స్పందన వస్తోంది. ఇప్పటికే కొన్ని బ్యాంకులు, కంపెనీలు ఆఫీస్ స్పేస్ కోసం పోటీ పడుతున్నాయి. వచ్చే ఏడాది మార్చిలోపు కొనుగోలుదారులకు అప్పగిస్తాం' అని తుడా వీసీ ఎన్.మౌర్య తెలిపారు.

ఏడాదికి అందుబాటులోకి

3.6 ఎకరాల్లో రూ.345కోట్లతో 'తుడా' టవర్స్ నిర్మాణం సాగుతోంది. గ్రౌండ్, ఒకటవ అంతస్థుల్లో 27 విశాలమైన గదులతో వాణిజ్య సముదాయాలు, రెండు, మూడు, నాలుగు అంతస్థులలో ఆఫీస్‌ల వినియోగానికి, మిగిలిన వాటిలో 230 రెసిడెన్షియల్ ఫ్లాట్లను నిర్మిస్తున్నారు. వీటిలో 42 డబుల్.. 152 ట్రిపుల్.. 32 నాలుగు బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. కమర్షియల్, రెసిడెన్షియల్‌కు వేర్వేరుగా పార్కింగ్, లిఫ్టులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏడాదిలోపు పూర్తిగా అందుబాటులోకి వస్తుందని అధికారులు చెబుతున్నారు.

ఐకానిక్ టవర్స్‌లో వసతులు, ధరలు ఇలా..

స్విమ్మింగ్ పూల్, వాకింగ్ పార్కు, పోడియం, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, రెస్టారెంట్, బంకెట్ హాల్, సూపర్ మార్కెట్, బ్యాంక్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగ ఇతర ఇండోర్ క్రీడల సౌకర్యాలను అందుబాటులో ఉంచనున్నారు. రెసిడెన్షియల్ కోసం 2బీహెచ్‌కే.. 1238 ఎస్ఎఫ్టీ- రూ.70లక్షలు, 3బీహెచ్‌కే.. 1903 ఎస్ఎఫ్టీ- రూ.1.12కోట్లు, 4బీహెచ్‌కే.. 3743 ఎస్ఎఫ్టీ- రూ.2.19కోట్లు చొప్పున ధరలు నిర్ణయించారు. కమర్షియల్ కోసం గ్రౌండ్ ఫ్లోర్.. 42664 ఎస్ఎఫ్టీ- ఒక్కో ఎస్ఎఫ్టీ రూ.12వేలు చొప్పున, ఫస్ట్ ఫ్లోర్ 64724 (రూ.10వేలు), ఆఫీస్ స్పేస్ 89919 ఎస్ఎఫ్టీ (రూ.7,500) ధరగా నిర్ణయించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఆఫ్‌లైన్‌లో అద్దె చెల్లింపులకు ఆదేశం

తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని ఇళ్లు, దుకాణాలు, మఠాలు, కార్యాలయాలకు సంబంధించిన అద్దె, కరెంటు, వాటర్ బిల్లులు ఆఫ్‌లైన్ ద్వారా కూడా కట్టించుకోవాలని టీటీడీ ఉన్నతాధికారులు సంబంధిత అధికారులను శనివారం ఆదేశించారు. అద్దె, కరెంటు, వాటర్ బిల్లులను ఆన్‌లైన్‌లో కట్టాలనే నిబంధనతో తిరుమలలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న కౌంటర్‌లో కంప్యూటర్‌కు యాక్సెస్‌ను గురువారం నుంచి కట్ చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో స్థానికులు ఇబ్బంది పడుతున్నారంటూ 'తిరుమలలో ఆగిన ఆఫ్‌లైన్ అద్దె చెల్లింపులు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో శనివారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఉన్నతాధికారులు స్థానికులకు ఇబ్బంది లేకుండా కౌంటర్‌ను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. శనివారం నుంచే కౌంటర్‌ను తెరవాలని అధికారులు ఆదేశించినప్పటికీ బ్యాంక్ సెలవు నేపథ్యంలో తిరిగి సోమవారం నుంచి కౌంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

అభాగ్యుడికి అండగా...
ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి

● కలెక్టరు చొరవతో ఉచిత వైద్యానికి భరోసా

తిరుపతి(వైద్యం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండు రోజుల వైద్యజ్యోతి మెగా హెల్త్‌క్యాంప్‌లో ఒక అభాగ్యుడికి కలెక్టర్ చొరవతో వైద్య సాయానికి మార్గం సుగమం అయ్యింది. నా అనే వాళ్లు లేక, ఆరోగ్య పరిస్థితి సహకరించక శ్రీకాళహస్తిలోని ఒక అనాథాశ్రమంలో ఉంటూ జీవనం సాగిస్తున్న బందాడ శ్రీనివాస్(76) వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకోవడానికి శనివారం వచ్చాడు. కలెక్టర్ వెంకటేశ్వర్ అతన్ని పలకరించారు. తన నిస్సహాయ స్థితిని అతను కలెక్టర్‌కి వివరిస్తూ కంట తడిపెట్టుకున్నాడు. వెంటనే స్పందించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ఆయన చేతిలోని మెడికల్ రిపోర్టులన్నీ తీసుకుని పరిశీలించారు. వెంటనే స్విమ్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వృద్ధుడికి అవసరమైన వైద్యాన్ని పూర్తి ఉచితంగా అందజేయాలని ఆదేశించారు. ఈ విషయాన్ని స్విమ్స్‌కు లేఖ రాసి వృద్ధుడికి అందించి వెంటనే స్విమ్స్‌కు వెళ్లాలని సూచించారు. అందుకు అవసరమైన రవాణా సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేయడంతో శ్రీనివాస్ పొంగుతున్న కన్నీళ్లతో కలెక్టర్‌కు చేతులు జోడించారు. ఆంధ్రజ్యోతి-వైద్యజ్యోతి శిబిరానికి రావడం తనకు ఎంతో మేలు చేసిందని కృతజ్ఞతలు తెలిపారు.



కలెక్టర్‌కు నమస్కరిస్తున్న బందాడ శ్రీనివాస్

మరో మైలురాయిని అధిగమించిన శ్రీసిటీ-కొబెల్కో



● కొబెల్కో నుంచి 20,000వ ఎక్స్‌కవేటర్ విడుదల

వరదయ్యపాళెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిర్మాణ పరికరాల తయారీ దిగ్గజ కంపెనీ కొబెల్కో కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్ ఇండియా శ్రీసిటీ ప్లాంట్‌లో 20,000వ ఎస్‌కే 220 ఎక్స్‌కవేటర్ ఉత్పత్తితో ఒక ప్రధాన మైలురాయిని అధిగమించింది. దీన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం కంపెనీ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ అద్భుత విజయం పట్ల కేసీఈఐకి ఆయన అభినందనలు తెలిపారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి, కేసీఈఐ సేల్స్ మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్ సమక్షంలో ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా లాంఛనంగా 20,000వ ఎక్స్‌కవేటర్‌ను విడుదల చేసి దానిని తమ ప్రధాన కస్టమర్ కేఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జలంధర్‌రెడ్డికి అందజేశారు. టకేమిచి హిరకావా మాట్లాడుతూ ఈ మైలురాయి తమ సంస్థ నిబద్ధతను సూచిస్తుందన్నారు. కేసీఈఐ ప్రారంభం నుంచి తమకు అమూల్యమైన సహకారం అందిస్తున్న శ్రీసిటీ ఎండీకి కృతజ్ఞతలు తెలిపారు. జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ 20,000వ యూనిట్‌ను అందుకోవడం గర్వంగా ఉందన్నారు.

20,000వ ఎక్స్‌కవేటర్ కీని జలంధర్‌రెడ్డికి అందచేస్తున్న కేసీఈఐ సేల్స్, మార్కెటింగ్ డైరెక్టర్, డివిజన్ హెడ్ మోసెస్, ఎండీ, సీఈవో టకేమిచి హిరకావా, శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్రా సన్నారెడ్డి తదితరులు

'30 రోజుల్లో తెలుగు రీడింగ్ ఛాలెంజ్' ఎంతో ఉపయుక్తం

● ఆర్జేడీ శామ్యూల్

తిరుపతి(విద్య), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా నిర్వహించిన '30 రోజుల్లో తెలుగు రీడింగ్ చాలెంజ్' కార్యక్రమం ఎంతో ఉపయుక్తంగా ఉందని పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ పేర్కొన్నారు.తిరుపతికి చెందిన భాస్కర్ రాజు ఎడ్యుకేషనల్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ ఇచ్చారు. తిరుపతి సంజయ్ గాంధీ కాలనీ మున్సిపల్ పాఠశాల, చంద్రగిరిలోని జేఆర్‌కేఆర్ ప్రాథమిక పాఠశాలలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి అక్కడి విద్యా ర్థులకు శిక్షణ ఇచ్చారు. 30 రోజుల పాటు సాగిన శిక్షణ శనివారంతో ముగిసింది. తిరుపతి సంజయ్‌గాంధి కాలనీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్జేడీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 3వ తరగతి విద్యార్థులతో 10వ తరగతి పుస్తకాలను చదివించి శిక్షణ ఫలితాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాతృభాషలో చదవడం, రాయడం బాగా వచ్చిన విద్యార్థులు ఇతర భాషల్లో కూడా ప్రావీణ్యత సాధించగలరన్నారు. ఈ శిక్షణద్వారా 2, 3 తరగతులు విద్యార్థులు కూడా 10వ తరగతి పాఠ్యపుస్తకాలను ధారాళంగా చదువుతున్నారని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అన్ని పాఠశాలల్లో 30 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టేలా ప్రయత్నిస్తామని చెప్పారు. డీఈఓ కేవీఎన్ కుమార్ మాట్లాడుతూ 30 రోజుల్లో తెలుగు చదవడం, రాయడంపై శిక్షణతో సత్ఫలి తాలు వచ్చాయన్నారు. అనంతరం శిక్షకులు భాస్కర్‌రాజును ఆర్జేడీ, డీఈఓ తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ, అర్బన్ ఎంఈవో భాస్కర్‌నాయక్, హెచ్ఎం ధనుంజయులునాయడు, ఉపాధ్యాయులు పద్మావతి, విజయ్‌కుమారి, అనిత, అనిల్‌కుమార్, ప్రవీణ, లావణ్య, కవిత, విద్యార్థులు పాల్గొన్నారు.



భాస్కర్‌రాజును సత్కరిస్తున్న ఆర్జేడీ శామ్యూల్, డీఈఓ కేవీఎన్ కుమార్, ధనుంజయులు నాయుడు తదితరులు

సైబర్ వలలో చిక్కిన మహిళ

● రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న వైనం


తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒక మహిళ సైబర్ వలలో చిక్కి రూ.55.85 లక్షలు పోగొట్టుకున్న ఘటన తిరుపతి రూరల్ మండలంలో చోటుచేసుకుంది. రూరల్ సీఐ చిన్నగోవిందు చెప్పిన వివరాల మేరకు.. సాయినగర్ పంచాయతీ టెలిఫోన్ కాలనీకి చెందిన మహిళ కాంట్రాక్టు టీచర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇన్వెస్ట్‌మెంటు అలియన్స్ ట్రైయినింగ్ గ్రూపు వీఐపీ సీ9 హరిసింగ్ బుక్ డిస్కషన్ కెనాన్ అసెట్స్ దత్తా అనే వాట్సాప్ గ్రూపులో చేరారు. అధిక డబ్బు ఆశ చూపించి గ్రూపు అడ్మిన్లు హరిసింగ్, కెనాన్ అసెట్స్ దుత్తా క్వాలిటీ పవర్ ఐపో బీజెసాన్ ఐపో హెక్సావేర్ టెక్నాలజీస్ ఐపో స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టమని ప్రేరేపించారు. వారు సూచించిన మేరకు బంధన్, ఐడీఎఫ్‌సీ, యూకో, ఆర్ఎంజీబీ తదితర 10 బ్యాంకు అకౌంట్లకు ఆమె రూ.55.85 లక్షలు జమచేశారు. కొన్ని రోజుల తర్వాత వాట్సాప్ గ్రూపులు క్లోజ్ అయ్యాయి. నిర్వాహకులు అందుబాటులో లేకుండాపోయారు. మోసపోయానని గుర్తించిన బాధితురాలు వెంటనే సైబర్ క్రైం 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కేసు నమోదు చేశారు.

రూ.22 లక్షలు పోగొట్టుకున్న మరో యువతి

సైబర్ మోసగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.22 లక్షలు పోగొట్టుకుంది. అలిపిరి ఎస్ఐ లోకేష్ కథనం మేరకు.. స్థానిక జీవకోన గోపాల్‌నగర్‌లో ఉంటున్న రేవతి బీటెక్ వరకు చదువుకుంది. వర్క్ ఫ్రం హోం ద్వారా పనిచేస్తోంది. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఆమె వాట్సాప్ నెంబరుకు ఓ మెసేజ్ పెట్టారు. టెలిగ్రామ్ యాప్‌లో హోటళ్లకు ఆన్‌లైన్ రివ్యూల ద్వారా రేటింగ్ ఇస్తే డబ్బులు వస్తాయని నమ్మించారు. అలాగే నమ్మకంగా చేస్తే సంస్థలో ఉద్యోగం కూడా ఇస్తామని చెప్పారు. వారి మాటలు ఆమె నమ్మింది. ఇంట్లో ఉన్న బంగారం తాకట్టు పెట్టి కొంత నగదు, తన అకౌంట్లో ఉన్న డబ్బులతో పాటు తెలిసిన వారి వద్ద అప్పులు చేసింది. మొత్తం రూ.22 లక్షలు కేటుగాళ్లు చెప్పిన అకౌంట్లలో నాలుగు విడతల్లో జమచేసింది. ఆ తర్వాత వారి వాట్సాప్ నెంబర్లు బ్లాక్ కావడంతో మోసపోయానని గ్రహించి 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేసింది. శనివారం అలిపిరి సీఐ రాంకిషోర్‌కు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ లోకేష్ కేసు నమోదు చేశారు.

తిరుమలలో అనధికార వ్యక్తుల గుర్తింపు

● ఇందులో ఓ పాతనేరస్తుడు కూడా..



తిరుమల, మార్చి22(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం పోలీసులు నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో 72 అనధికార వ్యక్తులను గుర్తించారు. ఎస్పీ హర్షవర్థన్‌రాజు ఆదేశాలతో అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు మూడు బృందాలుగా ఏర్పడి తిరుమలలోని వరాహస్వామి, కల్యాణకట్ట, ఎస్వీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఎలాంటి గుర్తింపు లేకుండా ఉంటున్న 72 మందిని గుర్తించారు. వారి పూర్వాపరాల గురించి ఆరా తీశారు. వారిని తిరుపతి తరలించార. ఇందులో 28 మంది స్త్రీలు ఉన్నారు. పోలీసులు గుర్తించిన అనధికార వ్యక్తుల్లో ఓ పాత నేరస్థుడు కూడా ఉండటం గమనార్హం. ప్రకాశం జిల్లాకు చెందిన రవి అనే పాతనేరస్థుడి వివరాలు బయటపడ్డాయి. తిరుమల ట్రాఫిక్,తిరుపతి ఎంవీఐ మూడు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకుని రూ.1.50లక్షలు జరిమానా విధించారు.

రామచంద్రాపురం ఎస్ఐ వీఆర్‌కు..
ట్రైనీ ఐపీఎస్ హేమంత్‌కు బాధ్యతలు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 22(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం ఎస్ఐ రామాంజనేయులును వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ హర్షవర్ధనరాజు శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి హేమంత్‌ను స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా నియమించారు. ఈయన ఎనిమిది నెలల పాటు అక్కడ విధి నిర్వహణలో ఉంటారు.

కేకేసీ కళాశాల విద్యార్థులకు ఘనంగా ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందును ఆరగిస్తున్న విద్యార్థులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తమ కళాశాలలో వివిధ మతాల విద్యార్థుల మధ్య అన్యోన్యత, సోదరభావం పెంచేందుకు రంజాన్ ఇఫ్తార్ విందును ఆనవాయితీగా అందిస్తున్నామని కేకేసీ హోమియోపతి వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శరవణన్ తెలిపారు. రంజాన్ ఇఫ్తార్ విందును శనివారం కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో చదివే విద్యార్థులు రంజాన్ ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్, వైస్ చైర్మన్లు కుప్పయ్యశెట్టి, నరసింహారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి ప్లాట్‌ఫామ్ పైకి బ్యాగ్ విసిరిన ప్రయాణికుడు

● నాలుగు కిలోల గంజాయి సీజ్




రైలులో నుంచి విసిరిన బ్యాగ్ - గంజాయి ప్యాకెట్లు

దొరవారిసత్రం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ నుంచి గుర్తు తెలియని ప్రయాణికుడు ప్లాట్‌ఫామ్ పైకి విసిరిన బ్యాగ్‌లో గంజాయి ఉన్నట్లు జీఆర్పీ పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం కామాఖ్య నుంచి చెన్నై మీదుగా యశ్వంత్‌పూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి దొరవారిసత్రం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్ పైకి నల్ల బ్యాగ్‌ను విసిరేశాడు. బ్యాగ్‌లో ఏముందోనన్న ఆందోళనతో అప్రమత్తమైన రైల్వేస్టేషన్ సిబ్బంది జీఆర్పీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. జీఆర్పీ ఎస్ఐ చెన్నకేశవ సిబ్బందితో కలిసి బ్యాగ్‌ను పరిశీలించగా నాలుగు కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. తమిళనాడుకు గంజాయిని తరలించే క్రమంలో పోలీసుల కంట పడి గంజాయి ప్యాకెట్లు ఉన్న బ్యాగ్‌ను ప్లాట్‌ఫామ్ పైకి విసిరేసి ఉంటారని జీఆర్పీ పోలీసులు అనుమానిస్తున్నారు. గంజాయిని సీజ్ చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెన్నకేశవ తెలిపారు.

ముగిసిన కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ప్రాజెక్టు వ్యవస్థాపక డైరెక్టర్ ప్రొఫెసర్ కేజే కృష్ణమూర్తి అంత్యక్రియలు శనివారం ముగిశాయి. కపిలతీర్థం రోడ్డులోని రామచంద్రనగర్‌లోని ఆయన నివాసం నుంచి అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర హరిశ్చంద్ర శ్మశాన వాటిక వరకు సాగింది. అక్కడ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కృష్ణమూర్తి భౌతిక కాయానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, సప్తగిరి పత్రిక చీఫ్ ఎడిటర్ రాధారమణ, టీటీడీ సీపీఆర్వో రవి, విశ్రాంత ప్రొఫెసర్ సర్వోత్తమరావు, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి, ఆకెళ్ల విభీషణశర్మ, ఎస్కేయూ ప్రొఫెసర్, బాల సుబ్రహ్మణ్యం, ఓఆర్ఐ డైరెక్టర్, సిబ్బంది, శ్వేత సిబ్బంది, టీటీడీ సిబ్బంది నివాళులు అర్పించారు.

భక్తులతో శ్రీవారిమెట్టు కిటకిట



చంద్రగిరి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గం శనివారం భక్తులతో కిటకిటలాడింది. గంటల తరబడి వాహనాలు నిలిచిపోయాయి. మరోపక్క కనీస వసతులు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులను టీటీడీ సెక్యూరిటీ సిబ్బంది అదుపు చేయలేకపోయారు. దీంతో చంద్రగిరి పోలీసులు చేరుకుని వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఉదయం సమయంలో ఉచిత బస్సు కూడా ఏర్పాటు చేయకపోవడంతో కొందరు ఆటోవాలాలు ఇష్టం వచ్చినట్లు రేట్లు వసూలు చేస్తున్నారని భక్తులు వాపోయారు. టోకెన్ల ఆశ చూపి ఆటో డ్రయివర్లు ఇక్కడికి తీసుకువచ్చారని పలువురు భక్తులు చెప్పారు. టోకెన్ల కోసం కొందరు ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. డిమాండుకు తగిన విధంగా టోకెన్లు ఇస్తే తమకు ఈ కష్టం ఎదురుకాదని వారు చెబుతున్నారు.

రేపు ఎల్లుండి విద్యుత్ సదస్సులు

రామచంద్రాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారానికి సోమవారం, మంగళ వారాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద ఉన్నతాధికరుల ఆధ్వర్యంలో రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నట్లు ఆశాఖ ఏఈ గిరి తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 9గంటలకు కుప్పంబాదూరు, సాయంత్రం 4గంటలకు నెత్తకుప్పం సబ్‌స్టేషన్లలో ఈఈ ఆశీర్వాదం, డీఈఈ శంకరయ్య ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహిస్తారన్నారు. మంగళవారం ఉదయం 9గంటలకు వెంకటరామాపురం, సాయంత్రం 4గంటలకు నడవలూరు సబ్‌స్టేషన్లలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

నేడు ఉగాది కవి సమ్మేళనం

తిరుపతి(కల్చరల్), మార్చి 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తెలుగు సాహితీ సంఘాల ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరగనుంది. ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరిగే కార్యక్రమానికి ఆసక్తి కలిగిన కవులు, రచయితలు పాల్గొనాలని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇందులో పాల్గొనే వారిలో ఐదుగురు ఉత్తమ కవులను సత్కరిస్తారని తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

నీటిని వృథా చేయొద్దు



విద్యార్థినికి బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ, పులికాట్ రేంజర్ నరసింహారావు, అధ్యాపకులు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూమిపై మానవ మనుగడకు అవసరమైన ప్రధాన వనరుల్లో ఒకటైన నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ శర్మ అన్నారు. శనివారం కళాశాలలో ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భూమిపై జలం లేకపోతే ఏ ప్రాణికీ మనుగడ ఉండదన్నారు. నీటిని కాలుష్యం గురుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థులు నీటి ప్రాముఖ్యతపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పులికాట్ రేంజర్ నరసింహారావు విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతను గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు విక్టోరియా రాణి, శ్రీనివాస్, నాగభూషణం, శరత్‌బాబు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తాం: ఈఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఈఈ శ్రీనివాసులు

నాయుడుపేట టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో బ్రేక్‌డౌన్‌లు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని ఈఈ శ్రీనివాసులు అన్నారు. శనివారం తుమ్మూరులోని సబ్ స్టేషన్‌లో వినియోగదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో పట్టణంలో ఏసీలు ఎక్కువగా వినియోగించడంతో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల వద్ద లూజ్ కనెక్షన్లు ఉన్నాయని, రైతులు తమ దృష్టికి తీసుకువచ్చారని తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ వరప్రసాద్‌రెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోండి: గురుమూర్తి

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బకింగ్‌హామ్ కాలువ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన లోక్‌సభలో మాట్లాడుతూ తూర్పు తీరం వాణిజ్యపరంగా శరవేగంగా అభివృద్ధి జరుగుతున్న నేపథ్యంలో బకింగ్‌హామ్ కాలువను అభివృద్ధి చేయడం ద్వారా ఓడరేవులను అనుసంధానించి జలరవాణా ప్రోత్సహించవచ్చన్నారు. దీనివల్ల మత్స్యకారులు, పరిశ్రమలకు మెరుగైన రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయన్నారు. నౌకాశ్రయాలు, జలమార్గాల మంత్రి శర్బానంద సోనోవాల్ స్పందిస్తూ బకింగ్‌హామ్ కాలువ ప్రాధాన్యం గుర్తించామని, 420 కిలోమీటర్ల పొడవున్న ఈ కాలువ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని చెప్పారు.

జాబ్‌మేళాలో 63మందికి ఉద్యోగాలు



నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రిన్సిపాల్ హనుమంతరావు

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డబ్ల్యూ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. శనివారం కళాశాలలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ సహకారంతో పలు కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. 63మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కాగా, వారికి నియామక పత్రాలను అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గాయత్రి, వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఆర్థిక ప్రమాణాలు పెంచేందుకు పీ-4 సర్వే

పెళ్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న పీ-4 సర్వేతో పేదల ఆర్థిక ప్రమాణాలు పెంపొందుతాయని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర కార్యదర్శి, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బంగారంపేట పంచాయతీల్లో చేపట్టిన పీ-4 సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ ఒబ్బు కిషోర్, అగ్రికల్చర్ అసిస్టెంట్ రాజేష్, మోహనకుమారి పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ అధికారుల తనిఖీలు

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో తారురోడ్ల పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. క్వాలిటీ కంట్రోల్ జేఈలు శ్రీనివాసరావు, కృష్ణయ్య ఆధ్వర్యంలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి అంబేడ్కర్ గురుకులం వరకు, గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద జరుగుతున్న తారు రోడ్డు పనుల నాణ్యత, వాడుతున్న మెటీరియల్స్‌ను శాంపిల్స్ పరిశీలించారు.

ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై శిక్షణ

కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రాంప్ట్ ఇంజనీరింగ్‌పై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, గురుతేజ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ మోడల్స్‌లో ప్రాంప్ట్‌ల ప్రాముఖ్యత, ప్రాక్టికల్ డెమోస్, కోర్స్ ప్రాజెక్టులకు ఉపయోగపడే చిట్కాల గురించి వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

శ్మశాన ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

కోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని మండల పరిధిలోని అల్లంపాడు పంచాయతీ పీకళ్ల దిబ్బ గ్రామస్తులు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పనబాక కోటేశ్వరరావు ఆధ్వర్యంలో శనివారం తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు. తమ గ్రామానికి చెందిన ఇద్దరు భూస్వాములు శ్మశాన భూమిని రొయ్యల చెరువులకు కరకట్టలుగా మార్చివేశారని ఆరోపించారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకువెళ్లడానికి దారిలేకుండా అడ్డుకుంటున్నారని, శ్మశాన భూమి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న పీకళ్లదిబ్బ గ్రామస్తులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నాయుడుపేట టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తుమ్మూరు, చంద్రబాబు కాలనీ, పాత తహసీల్దారు కార్యాలయం, భరత్‌నగర్, ఎన్ఎస్ఆర్ కాలనీ, మంగపతినాయుడు నగర్, ఆర్ముగం నగర్, దర్గారోడ్డు, రాజగోపాలపురం, శ్రీరామ్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పట్టణ ఏఈ శివశంకర్ తెలిపారు.

సెలవు రోజూ పన్నులు చెల్లించవచ్చు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో సెలవు రోజైన ఆదివారం కూడా ఇంటి, కుళాయి పన్నులు చెల్లించవచ్చునని కమిషనర్ చిన్నయ్య తెలిపారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం 10నుంచి సాయంత్రం 6 గంటల వరకు మున్సిపల్ కార్యాలయంలో పన్నులు చెల్లించేందుకు సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

వరకట్న వేధింపులపై కేసు

కోట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు గ్రామానికి చెందిన టిప్పుసుల్తాన్ కట్నం కోసం వేధిస్తున్నాడని ఆయన భార్య షేక్ దిల్‌షాద్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.





జగనన్న కాలనీ పక్కన గ్రావెల్ తవ్వడంతో ఏర్పడిన గుంతలు - మన్నారుపోలూరు సమీపంలో ఓ లేఅవుట్‌కు తరలించిన మట్టి

చెలరేగిపోతున్న మట్టి మాఫియా

ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట డివిజన్‌లో గ్రావెల్, మట్టి మాఫియా రెచ్చిపోతోంది. పట్టించుకునే వారే లేకపోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములు, ఇళ్ల ప్లాట్లు, పంట కాలువలను సైతం వదలడం లేదు. సూళ్లూరుపేటలో మున్సిపాలిటీ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలో ప్రభుత్వ భూములు, తెలుగుగంగ కాలువ గ్రావెల్ మాఫియా కబంధ హస్తాల్లో చిక్కుకుపోయింది. 15 అడుగుల పైబడి గ్రావెల్ తవ్వేస్తుండటంతో భారీ గోతులు ఏర్పడుతున్నాయి. టిడ్కో ఇళ్ల ఎదురుగా ఉన్న జగనన్న లేఅవుట్ పక్కనే ఉన్న ప్రభుత్వ భూముల్లోనూ గ్రావెల్ తవ్వకాలు జరుపుతున్నారు. అదే విధంగా ఇలుపూరు రోడ్డు పక్కన తెలుగుగంగ కాలువలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. ఎక్స్‌కవేటర్ల సాయంతో కాలువలో గ్రావెల్ తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న లేఅవుట్ల నిర్మాణానికి గ్రావెల్, మట్టి అవసర కావడంతో అక్రమార్కులు ప్రభుత్వ భూములు, కాలువల్లో తవ్వి తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. సమీప ప్రాంతాల ప్రజలు రెవెన్యూ, పోలీసులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడం లేదు. దీంతో గ్రావెల్ మాఫియాకు అడ్డూఅదుపూ లేకుండా పోతోంది. పట్టించుకోవాల్సిన మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.

మహిళల ఆర్థికాభివృద్ధే సీఎం ధ్యేయం: పాశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నియోజకవర్గ పరిధిలోని వెలుగు సిబ్బందితో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబునాయుడు మొట్టమొదటగా పొదుపు సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలను అందించి మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతో తోడ్పాటును అందించడమే కాకుండా వారి సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ పొదుపు సంఘాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. అనంతరం పొదుపు సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, మధుసూదన్ రెడ్డి, వాటంబేడు శివకుమార్, పెంచలయ్య, సురేంద్ర, చిరంజీవి, భారతి, సిబ్బంది, పొదుపుసంఘాల మహిళలు పాల్గొన్నారు.

భూగర్భజలాల అభివృద్ధికి చర్యలు

చిల్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జాలలను అభివృద్ధి పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని కమ్మవారిపాళెం పంచాయతీలో ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవంలో భాగంగా ఫారం పాండ్ పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం పాండ్లు ఏర్పాటు చేయడం ద్వారా భూగర్భజాలలు మెరుగుపడి నీటి ఎద్దడి నివారణకు దోహదపడుతాయన్నారు. ఉపాధి హామీ పథకంలో ఈ పనులు చేపడుతుండడంతో కూలీలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. రైతులు పొలాల్లో కూడా ఫారం పాండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా ధాన్యానికి ప్రభుత్వం గిట్టుధర కల్పించి 24గంటల్లో నగదు చెల్లించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. రైతులను మోసం చేస్తే దళారులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే హెచ్చరించారు. పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, పచ్చా వెంకటేశ్వర్లు నాయుడు, యదనపర్తి భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో మహిళ ఆత్మహత్య



మృతురాలు నాగమణి

వెంకటగిరి టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏనుగుల పాళెం ప్రాంతానికి చెందిన బూచి నాగమణి అప్పుల బాధతో తెలుగు గంగ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ సుబ్బారావు కథనం మేరకు... ఏడాది కాలంగా భర్తకు దూరంగా ఉంటున్న నాగమణి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేది. అద్దె ఇంటి ఉంటున్న ఆమె 9వ తరగతి చదువుతున్న కుమార్తె, 2వ తరగతి కొడుకు చదువుల కోసం అప్పులు చేసింది. అలాగే స్వయం సహాయక సంఘం నుంచి కొంత పొదుపు నగదు తీసుకుంది. నెలనెలా పిల్లల చదువులు, ఖర్చులు, ఇంటి అద్దె, పొదుపు సొమ్ము చెల్లింపు భారంగా మారడంతో మనస్తాపానికి గురైన నాగమణి శనివారం మధ్యాహ్నం రాపూరు రోడ్డు కలపాడు వద్ద ఉన్న తెలుగుగంగ కాలులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరకుని గాలించగా జంగలాపల్లి వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

విధుల నుంచి బిల్ కలెక్టర్ తొలగింపు

నాయుడుపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్న బిల్ కలెక్టర్ రమేష్‌ను తాత్కలికంగా విధుల నుంచి తొలగించినట్లు కమిషనర్ ఫజులుల్లా శనివారం తెలిపారు. మున్సిపాలిటీకి చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణాల అద్దె వసూలు చేసిన రమేష్ ఆ నగదు కార్యాలయంలో చెల్లించ లేదని ఫిర్యాదు అందడంతో చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

ఎంసీఎఫ్ ట్రస్టు సేవలు ప్రశంసనీయం



శుద్ధిజల ప్లాంటును ప్రారంభిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

దక్కిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మౌనిక చారిటబుల్ ట్రస్టు సేవలు ప్రశంసనీయమని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. దక్కిలి మండలం వెలికల్లు గ్రామంలో ఎంసీఎఫ్ ట్రస్టు చైర్మన్ మౌనికరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధి జల వాటర్ ప్లాంటును శనివారం సబ్‌కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత తాగు నీటిని ప్రజలకు అందించడానికి కృషి చేసస్తున్న మౌనికరెడ్డిని అభినందించారు. వెంకటగిరి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త జంపాల ప్రకాష్ మాట్లాడుతూ పదకొండేళ్ల నుంచి ఎంసీఎఫ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ట్రస్టు చైర్మన్ మౌనిక రెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్టు ఆధ్వర్యంలో ఏపీలోనే కాకుండా తెలంగాణ ప్రాంతంలో కూడా సేవాకార్యక్రమాలు మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా సురేష్ చైతన్య



కోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన న్యాయవాది, టీడీపీ మండల అధికార ప్రతినిధి దాసరి సురేష్ చైతన్య డివిజనల్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. శనివారం ఆయనను పలువురు టీడీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, న్యాయవాదులు అభినందించారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

పెళ్లకూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉచితం మాటున సాగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ఎస్ఐ నాగరాజు నిఘా పెట్టారు. ముమ్మారెడ్డిగుంట నుంచి తాళ్వాయిపాడు వరకు స్వర్ణముఖినది నుంచి ప్రతిరోజు ట్రాక్టర్లతో ఇసుక రవాణా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి శనివారం దాడులు నిర్వహించారు. దిగువచావాలి వద్ద స్వర్ణముఖినది నుంచి ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

టిప్పర్ బోల్తా

సూళ్లూరుపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ ఆర్చి సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం టిప్పర్‌కు ఆవు అడ్డురావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న నీటి కొలను గోతిలో బోల్తాపడింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు వార్తలు

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల కలయిక



పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2008లో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలిటెక్నిక్‌ను ప్రారంభించినప్పుడు ఇరుకైన గదులు, ఇతర కళాశాలల్లో ప్రాక్టికల్స్, చెట్ల కింద చదువులను ఆంధ్రజ్యోతి చొరవ తీసుకుని సమస్యలకు అద్దం పడుతూ వ్యాసం రాయడంతో అప్పటి ఎమ్మెల్యే రోజా స్పందించి ఏడాదిలోపు పిళ్లారిపట్టు వద్ద సొంత భవనాలను నిర్మించి ఇక్కడకు తరలించారు. ఈ విషయాన్ని పూర్వ విద్యార్థులు నెమరువేసుకున్నారు. ప్రిన్సిపాల్ కుమార్, అతిథులు ఉషాదేవి, దేవరాజులు, అధ్యాపకులు సుగుణ, అమర్నాథ్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో విద్యుత్ వినియోగదారుల సదస్సులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు అర్బన్, రూరల్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 24, 25 తేదీల్లో ఆయా సబ్ స్టేషన్లలో వినియోగదారుల సదస్సులు నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఏఈ జయసాయి, రూరల్ ఏఈ రవికుమార్ తెలిపారు. 24వ తేదీన 11 గంటలకు పుత్తూరు, 3 గంటలకు లక్ష్మీనగర్, 11 గంటలకు దిగువపుత్తూరు, 3 గంటలకు పరమేశ్వరమంగళం, 25న 11 గంటలకు కళ్యాణపురం, 3 గంటలకు పైడిపల్లి సబ్ స్టేషన్లలో సదస్సులు జరుగుతాయని అన్నారు. తమ సమస్యలను వినియోగదారులు పరిష్కరించుకోవాలని ఆయన కోరారు.

ఉగాదికి అన్న క్యాంటీన్



అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ మంజునాథ్ గౌడ్, డీఈ చంద్రశేఖర్ రెడ్డి

పుత్తూరు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ పరిధిలో ఉగాది రోజున అన్న క్యాంటీన్ అందుబాటులోకి రానుంది. ఈ మేరకు పనులు వేగవంతంగా సాగుతున్నాయి. శనివారం డీఈ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పనులను పర్యవేక్షించారు. యూడీఎస్ పైప్‌లైన్, ఆవరణలో టైల్స్ తదితర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్ బాబురావును ఆదేశించారు. రూ.62 లక్షల అంచనాతో నిర్మాణం చేపట్టినప్పటికీ వివిధ కారణాలతో అన్న క్యాంటీన్ పనుల్లో జాప్యం నెలకొంది. ఎట్టకేలకు ఉగాదికి ప్రారంభించాలనే ఆలోచనలో పాలకులు ఉన్నారు. పుత్తూరు అంబేడ్కర్ కూడలికి అతి సమీపంలో ఏర్పాటవుతున్న అన్న క్యాంటీన్‌లో నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే బాధితులకు, రైతులు, చిన్న వ్యాపారులకు అందించనున్నారు.

జలాన్ని సంరక్షించాల్సిన బాధ్యత అందరిది



మాట్లాడుతున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జీవరాశులకు ప్రాణాధారమైన జలాన్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. ప్రభుత్వ కళాశాలలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సుతోపాటు ప్రపంచ జల దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో క్రమంగా పెరుగుతున్న మంచి నీటి కొరత, నీటి కాలుష్యంపై ప్రజలను చైతన్యపరచాలని అన్నారు. మండల లీగల్‌సెల్ న్యాయవాది మురుగారెడ్డి మాట్లాడుతూ దేశాల మధ్య నీటి యుద్ధాలు ప్రారంభమవుతున్నాయని చెప్పారు. న్యాయవాది గోపీకృష్ణ, అధ్యాపకులు వీరయ్య, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

● ఈవోకు ఫిర్యాదు చేసిన భక్తులు



సదాశివేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

పుత్తూరు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ పరిధిలోని సదాశివేశ్వర స్వామి, ఆరేటమ్మ ఆలయాలకు భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు ప్రక్రియను శనివారం చేపట్టారు. ముందుగా ఆరేటమ్మ ఆలయంలో లెక్కింపు చేపట్టగా రూ.45,478లు వచ్చాయి. లెక్కింపు ప్రక్రియలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాల్సిన దేవదాయ శాఖ అధికారిణి ఈ సందర్భంగా చేతివాటం ప్రదర్శించడాన్ని లెక్కింపు కోసం వచ్చిన భక్తులు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జీవరత్నం నాయుడు గమనించి ఈవో జయకృష్ణ దృష్టికితీసుకెళ్లారు. ఈ విషయాన్ని దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు. అనంతరం సదాశివేశ్వరస్వామి ఆలయంలో హుండీ లెక్కింపు ప్రక్రియ చేపట్టగా, రూ.2,00,730లు వచ్చినట్లు ఈవో చెప్పారు. బంగారు, వెండి, ఇతర కానుకలు ఏవీ రాలేదని తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుమన ప్రియ, ఈవో జయకృష్ణ, జీవరత్నం నాయుడు, మనోహర్‌రెడ్డి, పూజారి ప్రతిభ, స్కౌట్ అండ్ గైడ్ వెంకటేష్, పోలీస్ కానిస్టేబుల్ ఉదయగిరి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగంలోకి సంపద తయారీ కేంద్రాలు



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

వడమాలపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుపయోగంగా ఉన్న సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని డీఎల్‌పీవో సురేష్ నాయుడు తెలిపారు. శనివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో నిరుపయోగంగా సంపద తయారీ కేంద్రాలు శీర్షికన వార్త వెలువడింది. దీనిపై డీఎల్‌పీవో స్పందించారు. శనివారం మండలంలోని ఏఎంపురంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టారు. మండలంలోని తిరుమణ్యం, అప్పలాయగుంట, పూడిలో ఉన్న కేంద్రాలను పరిశీలించి కార్యదర్శులు, సిబ్బందికి సూచనలిచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 14 సంపద తయారీ కేంద్రాల్లో పేడ, పొడి చెత్త నింపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఈవోపీఆర్డీ దయాసాగర్, డీఆర్పీ కిషోర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రెండు విద్యాసంస్థల్లో జాబ్‌మేళా

● 73 మంది అభ్యర్థుల ఎంపిక



శ్రీవిద్యా డిగ్రీ కళాశాల జాబ్ మేళాలో ఎంపికైన అభ్యర్థులు

పుత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జరిగిన జాబ్‌మేళాలో 41 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈ మేళా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి, సీడాప్, డీఆర్‌డీఏల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ మేళాలో 98 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక శ్రీవిద్యా డిగ్రీ కళాశాలలో జరిగిన జాబ్ మేళాలో 32 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఆ కళాశాల చైర్మన్ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ మేళాను ఎంఆర్ఎఫ్ టైర్స్ కంపెనీ నిర్వహించగా, 115 మంది అభ్యర్థులు పాల్గొన్నారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు వెంకటరమణ నియామక పత్రాలను అందించారని ఆయన తెలిపారు.

గెజిట్‌కు లోబడే రుసుం వసూలు చేయాలి

పుత్తూరు అర్బన్/పుత్తూరు టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణ పరిధిలో మున్సిపల్ గెజిట్‌కు లోబడే రుసుం వసూలు చేయాలని వీధి విక్రయదారుల సంఘం డిమాండ్ చేసింది. శనివారం మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను ఏఐటీయూసీ నాయకులు మహేష్, నజీర్ ఆధ్వర్యంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వ్యాపారాలు ఉన్నా లేకపోయినా రుసుం విధిగా చెల్లిస్తున్నామని తెలిపారు. బయటి నుంచి హోల్‌సేల్ వ్యాపారాలు చేస్తుండటంతో తాము నష్టపోతున్నామని, గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు వ్యాపారాలకు అనుకూలంగా స్థలం కేటాయించాలని కోరారు. వీధి వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు వేలు, కార్యదర్శి నవీన్, కోశాధికారి హేమ భాస్కర్ బాయ్ పాల్గొన్నారు.

పంట సంజీవనితో భూగర్భ జలాల పెంపు

● ఎమ్మెల్యే ఆదిమూలం



స్వయం సహాయక సంఘాల సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పిచ్చాటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉచితంగా పంట సంజీవని(ఫారం పాండ్) నిర్మించి ఇవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెంపునకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఆదిమూలం స్పష్టం చేశారు. శనివారం ఉదయం ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన పంట సంజీవని పనులను ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని రైతులు పంట సంజీవిని తవ్వుకుంటే భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు ఇంకిపోకుండా ఉంటుందని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. అంతకు ముందు పిచ్చాటూరు జడ్పీ హైస్కూలు చుట్టూ నిర్మిస్తున్న ప్రహరీగోడను ఎమ్మెల్యే పరిశీలించి, పనులు అర్ధాంతరంగా ఆగిపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కీళపూడి గ్రామానికి చెందిన మురుగు నీరు పాఠశాల ఆవరణలోకి వదలడాన్ని గమనించి.. ఈ నీటిని కాలువ ద్వారా అరణియార్ వైపు మళ్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వెలుగు కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఉపాధి ఏపీడీ సరిత, ఎంపీడీవో మహ్మద్ రఫీ, తహసీల్దార్ టి.వి.సుబ్రహ్మణ్యం, ఏపీవో నాగభూషణమ్మ, ఏపీఎం చంద్రకళ, నేతలు ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, పద్దు రాజు, వాసురెడ్డి, రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి పూజ, కలశపూజ చేశారు. అనంతరం స్వామివారికి నువ్వుల నూనె, మంచినూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పలు పుష్పాలతో అలంకరించి, విశేష పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు.

బంగారమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టండి



ఈవో బాపిరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బంగారమ్మకాలనీ అభివృద్ధి సేవాసంఘం

శ్రీకాళహస్తి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న బంగారమ్మ ఆలయ జీర్ణోద్ధరణ పనులను చేపట్టాలని బంగారమ్మ కాలనీ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు శనివారం ఈవో బాపిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ బంగారమ్మ ఆలయ కుంభాభిషేకం 2011లో జరిగిందన్నారు. ప్రస్తుతం ఆలయం జీర్ణావస్థకు చేరుకుందని, జీర్ణోద్ధరణ పనులు చేపట్టి మహా కుంభాభిషేకం నిర్వహించాలని కోరారు. గతంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి కూడా వివరించినట్లు తెలిపారు. ఇందుకు ఈవో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో వనమాల నాయుడు, మనోహర్, శ్రీనివాసులు, మాధవయ్య, సోమశేఖర్ నాయుడు, లీలామోహన్, గోపాల్, గోవిందస్వామిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బంగారమ్మ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆ కాలనీ అభివృద్ధి సేవా సంఘం సభ్యులు తొట్టంబేడు రెవెన్యూ అధికారులను కోరారు. శనివారం తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.

విజయేంద్ర సరస్వతి ఆశీర్వాదం పొందిన ప్రముఖులు



ఎస్సీవీనాయుడిని ఆశీర్వదిస్తున్న విజయేంద్ర సరస్వతి

శ్రీకాళహస్తి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక విజయయాత్రలో భాగంగా గురువారం రాత్రి కంచికామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి శ్రీకాళహస్తికి విచ్చేసిన విషయం విధితమే. అందులో భాగంగా ప్రముఖులు ఆయనను శనివారం కలిసి ఆశీర్వాదం పొందారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ముస్లింల కృతజ్ఞతలు

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండుగ సందర్భంగా గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పట్టణంలోని ఎంజీఎం పాఠశాల వెనుకవైపు ఉన్న ఈద్గాను సుందరంగా తీర్చిదిద్దే పనులను చేయించారు. ఇందుకు ముస్లింలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. షఫీ, బషీర్, జిలానీ, కరీం, అస్మత్, చాన్‌బాషా, ముజీబ్, మీర్జా, జహీర్, మీర్జా పాల్గొన్నారు.

పల్లికొండేశ్వరుడి హుండీ ఆదాయం రూ.8,15,338



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

నాగలాపురం, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): నాగలాపురం మండల పరిధిలోని సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో శనివారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో ఆలయ హుండీ ఆదాయం రూ.8,15,338లు వచ్చినట్లు ఈవో లత తెలిపారు. ఇవి గత 60 రోజులుగా భక్తులు హుండీలో చెల్లించుకున్న కానుకలని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి డివిజన్ దేవదాయ శాఖ తనిఖీదారులు పణిరాజశయన, హెడ్ కానిస్టేబుల్ రవి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్కి ట్రస్ట్ ఆక్రమించుకున్న

దళితుల భూములను అప్పగించాలి

● నార్నె వెంకట సుబ్బయ్య



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు

గాంధీనగర్(విజయవాడ), మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కల్కి ఆశ్రమానికి ఆక్రమించిన దళితుల అసైన్డ్ భూములను తిరిగి వారికి ఇప్పించాలని హేతువాద సంఘం జాతీయ అధ్యక్షుడు నార్నె వెంకటసుబ్బయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇరవై ఏళ్ల క్రితం అప్పటి చిత్తూరు జిల్లా వరదయ్యపాలెం మండలంలోని బత్తలవల్లం గ్రామ పరిధిలో దళితులకు చెందిన వందలాది ఎకరాల భూములకు నకిలీ పత్రాలు సృష్టించి 2008లో రూ.500 కోట్లతో గోల్డెన్ టెంపుల్ నిర్మించారని ఆరోపించారు. తప్పుడు పత్రాలు సృష్టించి ఆ భూములు కల్కి ట్రస్ట్‌కు చెందుతాయని హైకోర్టుకు వెళ్లారన్నారు. దీనిపై అప్పటి నుంచి దళితులు పోరాడుతూనే ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో 2024 జనవరి 10న కల్కి ట్రస్ట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసిందన్నారు. అయితే జిల్లా అధికారులు కల్కి ట్రస్ట్ ప్రతినిధులతో కుమ్మక్కై దళితుల భూములను ఇప్పటివరకు వారికి అప్పగించలేదని ఆరోపించారు. వారి భూములు వారికివ్వాలని అడుగుతున్నారని ఆశ్రమంలో పని చేస్తున్న దళితులను తొలగిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కల్కి ట్రస్ట్ నుంచి భూములను స్వాధీనం చేసుకుని దళితులకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. కె.మునిచంద్రయ్య, పులి పోలయ్య, నీలమ్మ, బి.రాజయ్య, వెంకటయ్య, ఎస్.రాము, పులి వెంకటేష్, బి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి పురపాలక అభివృద్ధికి సహకరించండి

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ జాగా పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ గిరికుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను వెంటనే చెల్లించాలన్నారు. ఆదివారం, సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించేందుకు ఉదయం7 నుంచి రాత్రి 9గంటల వరకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చెల్లించని వారి ఇళ్లకు విద్యుత్‌శాఖ ద్వారా కరెంటు కనెక్షన్లు తొలగించబడుతాయని పేర్కొన్నారు. ప్రజలు వెంటనే పన్నులు చెల్లించాలన్నారు.

మాట నిలబెట్టుకున్న విద్యాశాఖ మంత్రి

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఇచ్చిన మాటను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నిలబెట్టుకున్నారని టీడీపీ నాయకుడు కోబాకు లక్ష్మణ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో విద్యార్థులకు నారా లోకేష్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని భరోసా ఇచ్చారన్నారు. గత వైసీపీ పాలకులు రూ.4,271 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి వెళ్లగా టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో రూ.788 కోట్లు విడుదల చేయగా, ప్రస్తుతం రూ.600 కోట్లు విడుదల చేసిందన్నారు. త్వరలోనే మరో రూ.400 కోట్ల బకాయిలు చెల్లిస్తారన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చేసి వారికి భరోసా ఇచ్చారన్నారు.

కేజీబీవీలో ఆరో తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కేవీబీపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కేవీబీపురంలోని కేజీబీవీ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి 6వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సుకన్య శనివారం తెలిపారు. ఈ నెల 22నుంచి ఏప్రిల్ 11వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అర్హతను బట్టి ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా బడి మానేసిన పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల బీపీఎల్ కింద జీవించే వారికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆమె చెప్పారు.

విద్యుత్ దీపాలు వెలిగించండి సారూ...

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని 17వ వార్డు పరిధిలోని రంగయ్యనాయుడు పాఠశాల సమీపంలో ఉన్న వీధి దీపం గత పదిరోజులుగా పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలో కుక్కల బెడద అధికంగా ఉందని, దీంతో రాత్రి పూట ప్రజలు ఆ ప్రాంతంలో రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వెంటనే విద్యుత్ స్తంభానికి మరమ్మతులు చేసి వీధి లైటు వెలిగేలా చూడాలన్నారు.

దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వకపోతే

కలెక్టరేట్‌కు పాదయాత్ర చేపడతాం

● ఏపీ రైతు సంఘం కార్యవర్గ సభ్యులు రామానాయుడు



దీక్షలో మాట్లాడుతున్న రామానాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనమనంబేడు దళితులకు ఇంటి పట్టాలు వారం రోజుల్లోపు ఇవ్వకపోతే బుచ్చినాయుడుకండ్రిగ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేపడతామని ఏపీ రైతు సంఘం కార్యవర్గ సభ్యులు రామానాయుడు తెలిపారు. ఇంటి పట్టాల కోసం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో 11వ రోజు చేపట్టిన దళితుల రిలే దీక్షకు శనివారం సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని జీవో ఇచ్చినప్పటికీ తహసీల్దార్ పట్టించుకోక పోవడంతో రెండు నెలలుగా దళితులు నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈవిషయాన్ని రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రామకృష్ణతో కలిసి రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇంటి పట్టాలు ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్, సీపీఐ ఏరియా కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, దళితులు పాల్గొన్నారు.

రీసర్వేతో భూసమస్యల పరిష్కారం

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వేతో భూసమస్యలు పరిష్కారం అవుతాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండలంలోని పార్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని చల్లమాంబపురం, తిమ్మాభూపాలపురం రెవెన్యూలలో జరగవలసిన సర్వేపై శనివారం సర్వేయర్లకు డివిజన్ డిప్యూటీ సర్వేయరు ప్రసాద్ రావు, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ భూముల సర్వేతో భూ వివాదాలు పూర్తిస్థాయిలో పరిష్కారమవుతాయన్నారు. రైతులు సర్వే జరిగేటప్పుడు వారి భూముల దగ్గర రికార్డులతో ఉండాలన్నారు. ఈ రెండు గ్రామాలలో సర్వేకు ముందు రైతులతో గ్రామ సభ నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజల్‌సేవ

నారాయణవనం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వెంకన్న ఊంజల్‌సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య స్వామి, అమ్మవార్ల ఊంజల్‌సేవను నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున విచ్చేసి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానానికి దారి ఏర్పాటు



శ్మశానానికి దారి ఏర్పాటు చేస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండం చిన్నకన్నలి గ్రామం వద్ద శ్మశానానికి వెళ్లే దారిని కొన్ని సంవత్సరాలుగా కొంతమంది ఆక్రమించుకోవడంతో దారి లేకుండా పోయింది. ఈ సమస్యను గ్రామస్థులు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన తహసీల్దారుతో చర్చించారు. శనివారం శ్మశానానికి దారి ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరాజా నాయుడు, సర్పంచ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పంచాయతీ దుకాణాల వేలం

రేణిగుంట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సంవత్సరం రోజులుగా జాప్యం జరుగుతున్న రేణిగుంట పంచాయతీ వేలం పాటను ఎట్టకేలకు శనివారం నిర్వహించారు. బస్టాండ్‌తో పాటు, 11 పంచాయతీ దుకాణాల వేలం పాట వాయిదా పడింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో డీఎల్‌పీవో ప్రభురెడ్డి ఆధ్వర్యంలో వారపుసంత, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ పార్కింగ్, 15 దుకాణ సముదాయాలకు వేలం పాట నిర్వహించగా, వారపు సంతను రూ.16.50 లక్షలకు, దినసరి కూరగాయల మార్కెట్‌ను రూ.20.5 లక్షలకు గుత్తేదారులు వేలం పాటలో దక్కించుకున్నారు. పోస్టాఫీస్ వద్ద ఉన్న నాలుగు దుకాణాలకు, బస్టాండ్ పార్కింగ్ వసూళ్లకు సర్కారు వారి పాట అధికంగా ఉండడంతో వాయిదా పడింది. అలాగే ఆర్టీసీ బస్టాండ్‌లో దక్షిణం వైపు ఉన్న పంచాయతీకి చెందిన 7 దుకాణాలకుగాను రెండింటిని పాడుకోగా, మిగిలిన ఐదింటిని పాడేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నగేష్, పంచాయతీ కార్యదర్శి మణి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎటువంటి ఘర్షణలు చోటు చేసుకోకుండా సీఐలు శరత్ చంద్ర, మురళీకృష్ణ, ఎస్ఐలు అరుణ్‌కుమార్, సుధాకర్ భద్రత కల్పించారు.

ఉపాధ్యాయ వ్యవస్థకే తలమానికం



కూనాటి సురేష్‌ను సన్మానిస్తున్న దామోదర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వ్యవస్థకే తలమానికం కూనాటి సురేష్ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి అన్నారు. 2024 సంవత్సరానికి రాష్ట్రస్థాయి గురుబ్రహ్మ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం కూనాటి సురేష్‌ను ఆయన స్వగృహంలో ఘనంగా సన్మానించారు. నేటి విద్యావ్యవస్థలో ఇలాంటి ఉపాధ్యాయులు ఉండటం ఎంతోగర్వకారణమన్నారు. కార్యక్రమంలో కరీముల్లా, సురేందర్‌రెడ్డి, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో చందు(19) అనే యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తొట్టంబేడు మండలం బసవన్నగుంటకు చెందిన చందు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. శనివారం కుటుంబ కలహాలతో ఇంటి వద్ద విషం సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేద

ప్రమాదాలకు నిలయంగా లింక్ బైపాస్



బైపాస్‌లో మార్కింగ్‌లేని స్పీడ్ బ్రేకర్లు

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పట్టణంలోని లింకు బైపాస్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉన్న నాలుకకు మందు వేస్తే కొండ నాలిక ఊడిందన్న చందంగా స్పీడ్‌బ్రేకర్ల నిర్మాణంతో ప్రమాదాలు అధికమవుతున్నాయి. పట్టణ శివార్లలోని బసవయ్యపాళెం వద్ద నాయుడుపేట రోడ్డు నుంచి తొట్టంబేడు వద్ద చెన్నై రహదారిని కలుపుతూ 12ఏళ్ల క్రితం లింక్ బైపాస్‌రోడ్డును నిర్మించారు. పట్టణ శివార్లలోని ఎల్ఐసీ కాలనీ నుంచి తొట్టంబేడు గ్రామానికి వెళ్లే రోడ్డు ఈ బైపాస్ మధ్య సాగుతుంది. దాంతో బైపాస్‌లో ప్రైవేటు టెన్నిస్‌కోర్టు వద్ద తొట్టంబేడు గ్రామ రోడ్డు సాగే వద్ద కూడలి ఏర్పడింది. బైపాస్‌కు ఒకే చోట రెండు రోడ్డు క్రాసింగ్‌లు ఏర్పడ్డాయి. ఎల్ఐసీ కాలనీ నుంచి బైపాస్‌కు చేరుకునే వాహనాలను.. బైపాస్‌లో వేగంగా వెళ్లే వాహనదారులు గుర్తించలేక ఢీకొంటున్నారు. అలాగే తొట్టంబేడు నుంచి పంచాయతీ రోడ్డు బైపాస్‌లోకి వాహనదారులు ప్రవేశించే సందర్భంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల ఈ రెండు చిన్న రోడ్ల నుంచి బైపాస్‌లోకి వాహనదారులు ప్రవేశించే సమయంలో పలు ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. రెండు క్రాసింగ్ రోడ్ల వద్ద స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయడం ద్వారా కూడలిలో ప్రమాదాలను నియంత్రించవచ్చు. అయితే అందుకు విరుద్ధంగా బైపాస్‌రోడ్డుపై క్రాస్ రోడ్డు కూడలి వద్ద ఇరువైపులా స్పీడ్‌బ్రేకర్లను 20రోజులక్రితం ఏర్పాటు చేశారు. కనీసం స్పీడ్ బ్రేకర్లకు మార్కింగ్ ఏర్పాటు చేయలేదు. నిత్యం బైపాస్‌రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనదారులు స్పీడ్ బ్రేకర్ల వద్ద ఆదమరచి అదుపు తప్పుతున్నారు. రాత్రి వేళల్లో ప్రతిరోజు వాహనదారులు దగ్గరకు వచ్చి సడన్‌బ్రేక్ వేస్తున్నారు. ఇక్కడ భారీ ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఘనంగా భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవ్‌ల వర్ధంతి

రేణిగుంట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని విద్యార్థుల సమక్షంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు చేసిన త్యాగాలు యువత మర్చిపోకూడదని తెలిపారు. ఉపాధ్యాయులు మధు, విజయలక్ష్మి, జన విజ్ఞాన వేదిక సభ్యులు వెంకటరమణ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన లారీ

● ఇద్దరికి గాయాలు

శ్రీకాళహస్తి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు గాయపడిన సంఘటన శనివారం తొట్టంబేడు మండలంలోని కన్నలి ఎస్టీకాలనీ వద్ద పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసుల కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడుకు చెందిన మహేష్(27) ట్రాక్టర్‌తో వాటర్ ట్యాంకర్‌ను కన్నలి వద్దకు తీసుకెళ్లాడు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన యూసఫ్ మైసూరు నుంచి లారీలో తొట్టంబేడు మండలంలోని ఓ ప్రైవేటు కర్మాగారానికి బయలుదేరాడు. ఈ క్రమంలో పెద్దకన్నలి ఎస్టీకాలనీ వద్ద ఆగివున్న ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టింది. ఈఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ మహేష్, లారీ నడుపుతున్న యూసఫ్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.